మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 07 గురువారం నవంబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 52

Navabhoomi daily fallows..




# అగ్రరాజ్య పీఠంపై మళ్లీ ట్రంప్..!

◆ అమెరికాలోని పత్రికలు జరిపిన సర్వేలన్నీ ట్రంప్‌కు వ్యతిరేకంగా వచ్చినా ఘన విజయం
◆ ట్రంప్ దాదాపు 51 శాతానికి పైగా ఓట్లు లభించగా.. హారిస్‌కు 47 శాతం
◆ రిపబ్లికన్ రాష్ట్రాలను నిలబెట్టుకోవడంతో పాటు.. స్వింగ్ స్టేట్స్ ఏడింటా ట్రంప్ హవా
◆ అరబ్, ముస్లింలు అధికంగా ఉన్న జార్జియాలో బైడెన్ హవా
◆ వలసల వాదనకు ట్రంపుకు అమెరికన్ల బలమైన మద్దతు

2



**వాషింగ్టన్-నవభూమిబ్యూరో**
అగ్రరాజ్యం అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. అమెరికాలోని పత్రికలు జరిపిన సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకమని తేల్చినా..
ప్రజలు మాత్రం అండగా నిలిచారు. కొంత విరామంతో ఒక అభ్యర్థి అమెరికా అధ్యక్ష స్థానంపై తిరిగి కూర్చోవడం 131 ఏళ్ల తర్వాత ఇదే. అంతేకాదు.. ఎన్నికలకు ముందు కోర్టు కేసులు ఇబ్బంది పెట్టినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా చివరి వరకూ పోరాడారు. 2016 నాటి ఫలితాలకు భిన్నంగా ఈసారి పాపులర్ ఓటు కూడా ట్రంప్‌నకే లభించింది. ఆయనకు దాదాపు 51 శాతానికి పైగా ఓట్లు లభించగా.. హారిస్ 47 శాతం వద్దే ఆగిపోయారు.

**స్వింగ్ మొత్తం ట్ర6ంప్ వైపే..**
సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాలను నిలబెట్టుకోవడంతో పాటు.. గంపగుత్తగా స్వింగ్ స్టేట్స్ ఏడింటా ట్రంప్ హవా నడిచింది. ముఖ్యంగా అమెరికాలో ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు, వేతనాలు, అక్రమ చొరబాట్లు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో తిరుగులేని విధంగా ప్రభావాన్ని చూపాయి.

**జార్జియాలో అనుకూల పవనాలు..**
అరబ్, ముస్లింలు అధికంగా ఉన్న జార్జియాలో ఈసారి మొదటి నుంచి కమలా హారిస్ వెనుకంజలోనే ఉన్నారు. గతంలో ఇక్కడ బైడెన్ హవా నడిచింది. కానీ, గాజా యుద్ధం విషయంలో డెమోక్రాట్ల వైఖరిపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరిని బుజ్జగించేందుకు కమలా హారిస్ ప్రచారం చివరిలో కూడా తాను గాజాలో శాంతిని నెలకొల్పేందుకు వీలైనంతగా యత్నిస్తానని హామీ ఇచ్చారు. అదేమీ పెద్దగా ఫలితం చూపలేదు. మరో వైపు ట్రంప్ తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో యుద్ధాన్ని ఆపేస్తానని హామీ ఇచ్చారు. దీనికి తోడు ఆయన హయాంలో అఫ్గాన్ యుద్ధాన్ని ఆపడం, మరే కొత్త యుద్ధంలోనూ అమెరికా తలదూర్చకుండా ఉండటం కూడా సానుకూలంగా మారింది.

**వలసల వాదనకు బలమైన మద్దతు..**
ట్రంప్ మద్దతుదారులు వలస అంశానికే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ విషయాన్ని ఏపీ ఓట్ కాస్ట్ ప్రజాభిప్రాయ సేకరణ కూడా వెల్లడించింది. వాస్తవానికి ఉత్తర అమెరికాలో అక్రమ వలసదారులు పెద్ద సమస్యగా మారారు. ఈ విషయాన్ని ట్రంప్ బలంగా వాడుకొన్నారు. జార్జియాలోని ప్రచారంలో మాట్లాడుతూ ఏకంగా 1798 నాటి ఎలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను తాను మళ్లీ తెరపైకి తెస్తానని హామీ ఇచ్చారు. రెండో ప్రపంచ యుద్ధ

## తెలంగాణలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

● సర్వేను ప్రారంభించిన వివిధ జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు
● ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సామాజిక, ఆర్థిక వివరాలను సేకరణ
● 75 రకాల ప్రశ్నలతో అన్ని వివరాల సేకరణ..
● ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలన్న మంత్రి శ్రీధర్‌బాబు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. వివిధ జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు సర్వేను ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సామాజిక, ఆర్థిక వివరాలను సేకరిస్తున్నారు.
ఉన్న ఆస్తులెన్ని.. అప్పులెన్ని.. ఆదాయమెంత.. ఇంట్లో ఎంతమంది ఉంటారు.. ఎవరైనా విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లారా.. ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారా.. ఇలా మొత్తం 75 రకాల ప్రశ్నలతో వివరాలు సేకరిస్తున్నారు. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతిఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే వృత్తి, ఉద్యోగ వివరాలను తీసుకుంటున్నారు.
కుటుంబంలో ఎవరైనా విదేశాలకు లేదా ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఏ కారణంతో వెళ్లారనేది కూడా చెప్పాలి. ఉన్నత చదువు లేదా ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి లేదా ఇతర అవసరాలకు వెళ్లారా.. అని కుటుంబ యజమానిని గణకులు అడుగుతున్నారు. విదేశాల్లో యూకే, అమెరికా, గల్ఫ్, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు ఐరోపా దేశాలకు వెళ్లినట్లు చెబితే ఒక్కో దేశానికి ఒక ప్రత్యేక కోడ్ నమోదు చేస్తున్నారు. మరే దేశానికి వెళ్లినా ఇతర దేశం అనే కోడ్ నమోదు చేస్తున్నారు. తెలంగాణ నుంచి ఎందరు వలస వెళ్లారు.. ఏ కారణంతో బయటకు వెళ్లారనే సమగ్ర సమాచారం సేకరించడానికి ఈ ప్రశ్నలు రూపొందించినట్లు తెలుస్తోంది.

**ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి: మంత్రి శ్రీధర్‌బాబు**
రంగారెడ్డి జిల్లా శంకరపల్లిలో సమగ్ర కుటుంబ సర్వేను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ ఆర్థిక ప్రణాళికల కోసం సర్వే చేపట్టినట్లు తెలిపారు. రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పోతాయని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీని వల్ల ఎలాంటి కార్డులు పోవని స్పష్టం చేశారు. ఇంటింటి సర్వేకు ప్రజలందరూ

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్

◆ సెన్సెక్స్ ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభం
◆ 24,500 కాస్త దూరంలో నిలిచిన నిఫ్టీ
◆ ఒక్కరోజే రూ.8 లక్షల కోట్లు పెరిగిన నమోదిత కంపెనీల విలువ
◆ వరుస నష్టాలతో కుదేలైన ఇన్వెస్టర్లలో జోష్

2



**ముంబయి-నవభూమిబ్యూరో:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం దాదాపు ఖరారైన వేళ..
అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ రాణించాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 24,500 కాస్త దూరంలో నిలిచింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజే రూ.8 లక్షల కోట్లు పెరిగి రూ.452 లక్షల కోట్లకు పెరిగింది.
అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో ట్రంప్ పైచేయి సాధించడంతో ముఖ్యంగా ఐటీ షేర్లలో ఇవాళ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఇన్ఫోసిస్, టీసీఎస్, రిలయన్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 4 శాతం మేర లాభపడింది. సూచీలోని 10 స్టాక్స్ లాభాల్లో ముగియడం గమనార్హం. ట్రంప్ ఆధిక్యంలో కొనసాగుతున్న వేళ డాలరు ఇండెక్స్ బలపడడం ఐటీ స్టాక్స్‌కు పాజిటివ్‌గా మారింది. ఆయా కంపెనీలకు అమెరికా కరెన్సీలోనే ఆదాయం వస్తుండడం ఇందుక్కారణమని అనలిస్టులు చెబుతున్నారు. మరోవైపు ట్రంప్ వస్తే చైనాపై సుంకాల మోత మోగుతుందన్న కారణంతో హాంకాంగ్, షాంఘై మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.
సెన్సెక్స్ ఉదయం 79,771.82 పాయింట్ల వద్ద (79,476.63) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇటీవల వరుస నష్టాలతో భారీగా పతనమైన సూచీలు కాస్త కోలుకున్నాయి. సెన్సెక్స్ మళ్లీ 80 వేల మార్కును దాటడమే కాకుండా.. ఇంట్రాడేలో 80,569.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 901.50 పాయింట్ల లాభంతో 80,378.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 270.75 పాయింట్ల లాభంతో 24,484 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.30గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం



◆ 14న 2వ విడత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు
◆ అదే రోజున 15వేల మందితో శంకుస్థాపన కార్యక్రమం
◆ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్
◆ వచ్చే విద్యా సంవత్సరంలోగా పూర్తి చేయాలని యోచన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** రెండో విడత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఈనెల 14న మంజూరు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అదే రోజున 15వేల మందితో కార్యక్రమం చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు.
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వచ్చే విద్యా సంవత్సరంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వైరా, మధిర నియోజకవర్గానికి చెందిన గురుకుల విద్యార్థులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన చదువు అందించడమే తమ లక్ష్యమని.. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం

## ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం
◆ ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ ఆమోదం
◆ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈ పాలసీ
◆ డ్రోన్ రంగంలో 40 వేల ఉద్యోగాల కల్పన దిశగా ప్రభుత్వం అడుగులు
◆ ప్రపంచ డ్రోన్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్, డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లును అభివృద్ధి
◆ 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ, టెస్టింగ్, ఆర్అండ్‌డీ ఫెసిలిటీ ఏర్పాటు
◆ 25 వేల మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ..50 డ్రోన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు

2



**అమరావతి-నవభూమి:** ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ జీఎస్టీ 2024 చట్ట సవరణ, 2014-18 మధ్య నీరు, చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆమోదం చెప్పింది.
రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ఏపీ డ్రోన్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రూ.వెయ్యి కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఈ పాలసీ తీసుకొచ్చారు. డ్రోన్ రంగంలో 40 వేల ఉద్యోగాల కల్పన

## విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా చిన అప్పల నాయుడు

● అనుభవం, సామాజిక వర్గం రీత్యా అప్పలనాయుడు పేరును ప్రకటించామన్న జగన్
● వెలమ సామాజిక వర్గానికి చెందిన అప్పలనాయుడు పేరును పార్టీ నేతలంతా బలపరిచినందున ప్రకటించామన్న వైఎస్సార్‌సీపీ నేత జగన్

2




**గుంటూరు-నవభూమిబ్యూరో:** విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిని వైఎస్సార్‌సీపీ ఖరారు చేసింది. సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు పేరును మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు.
బుధవారం పార్టీ నాయకులతో సమావేశమైన జగన్, వారందరి అభిప్రాయాలను తీసుకుని అప్పలనాయుడు పేరును ప్రకటించారు. విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్‌నేత బొత్సకు అవకాశం ఇచ్చిన దృష్ట్యా, ఈసారి వెలమ సామాజిక వర్గానికి చెందిన అప్పలనాయుడు పేరును పార్టీ నేతలంతా బలపరిచినందున ఈ నిర్ణయం తీసుకున్నామని వైఎస్ జగన్ అన్నారు. అనుభవం, సామాజిక వర్గం రీత్యా అప్పలనాయుడు పేరును ప్రకటించామన్నారు.
అప్పలనాయుడు అనుభవజ్ఞుడు, సీనియర్ అయినందున అందరి గౌరవాన్ని పొందుతారన్నారు. సమష్టి కృషితో విశాఖపట్నం ఎమ్మెల్సీ స్థానాన్ని చేజిక్కించుకున్నామని, విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీనికూడా అదే స్ఫూర్తితో గెలుచుకోవాలని పార్టీనేతలకు వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.
విజయనగరం జిల్లాల్లో స్థానిక సంస్థలకు చెందిన మొత్తం ప్రతినిధుల సంఖ్య 753 అని, ఇందులో 592 మంది వైయస్సార్‌సీపీ స్థానిక

## వర్రా రవీంద్రారెడ్డిని వదిలేసిన పోలీసులు

◆ సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్,మంత్రి లోకేశ్, హోం మంత్రి వంగలపూడి అనితలపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వర్రా
◆ వర్రాను అరెస్టు చేసి, 41-ఏ నోటీసు ఇచ్చి విడిచి పెట్టిన పోలీసులు
◆ సీఎం, డీజీపీ ఆగ్రహం..కడప ఎస్పీ హర్షవర్దన్ రాజుపై బదిలీ వేటు


వర్రా రవీంద్రారెడ్డి

**కడప-నవభూమిబ్యూరో:** వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు వదిలేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది.కడప తాలూకా పోలీసులు బుధవారం తెల్లవారుజామున రవీంద్రారెడ్డికి 41-ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. దీనిపై సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమల రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కడపలోని ఎస్పీ కార్యాలయానికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేరుకుని ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో సమావేశమయ్యారు. వర్రా రవీంద్రారెడ్డి



-2లో


## ఎన్నిసార్లు చెప్పాలి..?

● మంత్రులకు సీఎం సీరియస్ వార్నింగ్
● చాలామంది మంత్రులకు ఇంకా సీరియస్‌నెస్ రాలేదన్న చంద్రబాబు
● కొందరికి ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని విమర్శ
● కొందరు అధికారుల వల్ల ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటోందని వ్యాఖ్య

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు కేబినెట్ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో సీఎం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. చాలామంది మంత్రులకు ఇంకా సీరియస్ నెస్ రాలేదని... కొందరు

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
గురువారం
7 । నవంబర్ । 2024



## ఆ ముఖ్యమంత్రికి పాలాభిషేకం చేసిన తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్..

**హైదరాబాద్-నవభూమి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ కింద క్రీడా రిజర్వేషన్లు మూడు శాతం పెంచడంపై తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఇవాళ (బుధవారం) ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు పాలాభిషేకం చేశారు. అదే విధంగా డీఎస్సీలో 1,600లకు పైగా పిఈటీ, పీడీ పోస్టులు వేయాలని నిర్ణయం తీసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ తరపున చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోనూ వ్యాయామ విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాగంటి రాజేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వ్యాయామ విద్యా వ్యవస్థను పరిశీలించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు సంబంధించి 1,600లకు పైగా పిఈటీ, పీడీ ఖాళీలను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాజేశ్ డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన చాలా మంది వ్యక్తులు ఎటువంటి స్పోర్ట్స్ బ్యాక్ గ్రౌండ్ లేకపోయినా ఆయా రాష్ట్రాల్లో సర్టిఫికెట్లు తెచ్చుకుని తెలంగాణలో ఉద్యోగాలు సంపాదిస్తు న్నారని ఆయన మండిపడ్డారు.ఇలాంటి మోసాల వల్ల తెలంగాణ క్రీడాకారులకు అన్యాయం జరుగు తోందని రాజేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ తరపున ఆయన డిమాండ్ చేశారు.



## దూకుడు పెంచిన ఏసీబీ



**హైదరాబాద్-నవభూమి:** ఫార్ములా-ఈ రేసింగ్ అక్రమాలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఆర్ఈ (రెగ్యులర్ ఎంక్వయిరీ)ని మొదలుపెట్టి ఏసీబీ. ఆర్ఈ లో ఫైళ్లు పరిశీలించి, అక్రమాలు ఎలా జరిగాయి అనే దానిపై ఏసీబీ విచారణ జరుపనుంది. రెండు రోజుల్లో కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉంది. ఫార్ములా-ఈ రేసింగ్ సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు చెల్లించినట్లు ఏసీబీ గుర్తించింది.హైదరాబాద్, నవంబర్ 6: ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో ఏసీబీ దూకుడు పెంచింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా-ఈ రేసింగ్ అక్రమాలపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఆర్ఈ (రెగ్యులర్ ఎంక్వయిరీ)ని మొదలుపెట్టింది ఏసీబీ. ఆర్ఈలో ఫైళ్లు పరిశీలించి, అక్రమాలు ఎలా జరిగాయి అనేదానిపై ఏసీబీ విచారణ జరుపనుంది. రెండు రోజుల్లో కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చి విచారించే అవకాశం ఉంది. ఫార్ములా-ఈ రేసింగ్ సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు చెల్లించినట్లు ఏసీబీ గుర్తించింది. మునిసిపల్ శాఖ వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా ఆయా విదేశీ సంస్థలు, ప్రతినిధులకు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేయనున్నారు. రేస్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన గత ప్రభుత్వ పెద్దలకు కూడా నోటీసులు పంపించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.కాగా.. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో చోటుచేసుకున్నఅక్రమాలపై విచారణకు అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) ప్రభుత్వం అనుమతిచ్చిన విషయం తెలిసిందే. ఈ రేస్‌లో రూ.55 కోట్లు అక్రమాలు జరిగినట్లు గుర్తించిన మున్సిపల్ శాఖ ఏసీబీకి ఫిర్యాదు చేసింది. ఐఏఎస్‌లు సహా అప్పటి బీఆర్ఎస్ సర్కారు పెద్దల ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేసేందుకు అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత వచ్చే వారం నుంచి కేసుతో సంబంధం ఉన్నవారందరికీ విడివిడిగా నోటీసులు ఇచ్చి, విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నారు. ఐఏఎస్‌లు మొదలు కీలక అధికారులు, నాటి ప్రజాప్రతినిధుల దాక వీరిలో ఉండే అవకాశం ఉంది. స్టేట్‌మెంట్ ఆధారంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆదేశిస్తేనే విదేశీ సంస్థలకు నిధులు విడుదల చేశామని ఇప్పటికే అధికారులు వెల్లడించారు.


## ఆ పని చేసి కోట్ల రూపాయలు వెనక్కి తెప్పించాం: మంత్రి శ్రీధర్ బాబు..



**హైదరాబాద్** సైబర్ సెక్యూరిటీ వార్షిక సమ్మిట్-2024 (హ్యాక్ 2.0)ను జ్యోతి ప్రజ్వలన చేసి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కోసం చిత్రీకరించిన వీడియోలను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ సమ్మిట్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. టెక్నాలజీ పెరిగి నేటి సమాజంలో సైబర్ దాడులు పెరిగిపోతున్నాయని మంత్రి అన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి వారి జేబులు ఖాళీ చేయాలని కేటుగాళ్లు నిరంతరం కొత్త ఎత్తులు వేస్తున్నారని చెప్పారు. ఈ సమ్మిట్ ద్వారా ప్రజలకు సైబర్ మోసాలపై మరింత అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. హ్యాక్ 2.0 కార్యక్రమానికి టాలీవుడ్ నటుడు అడివి శేష్ సైతం హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. "సైబర్ నేరాల నిర్మూలనకు హ్యాక్ సమ్మిట్‌లో నిపుణుల సూచనలు, సలహాలు కీలకం అవుతాయి. సైబర్ సెక్యూరిటీకి వారి అమూల్యమైన సూచనలు ఎంతో అవసరం. సైబర్ నేరాలు కట్టడి చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా మంచి ఫలితాలను సాధిస్తున్నాం. హైదరాబాద్ రియల్ గ్లోబల్ సైబర్ సిటీగా రూపొందుతోంది. ప్రజా శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది.సైబర్ మోసాలకు గురి కాకుండా తెలంగాణ ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. మనల్ని మోసం చేసేందుకు కేటుగాళ్లు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. మాటలు చెప్పి బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తారు. అపరిచితుల నుంచి వచ్చే ఎటువంటి ఫోన్ కాల్స్, మెయిల్స్ లేదా మెసేజ్‌లకు స్పందించవద్దు. ఒకవేళ స్పందిస్తే బ్యాంకు ఖాతాల్లోని నగదును ఇట్టే మాయం చేస్తారు. ఈ సైబర్ నేరాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కోట్ల రూపాయలు రికవరీ చేసి బాధితులకు అందజేశాం" అని చెప్పారు.

## కుల గణన కోసం ఒక్కపూట బడులా..?



**హైదరాబాద్-నవభూమి:**ఇదేం దిక్కుమాలిన ఆలోచన రేవంత్ రెడ్డి గారు? కుల గణన కోసం ఒక్క పూట మాత్రమే బడులు పెడుతారా? అది కూడా మూడు వారాల పాటు! మీ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారా? అని సూటిగా ప్రశ్నించారు. పేద, బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల పిల్లలు చదువుతారు కాబట్టి మీరు ఒక పూట బడులు కూడా మూసేస్తారా? పేదలంటే ఇంత నిర్లక్ష్యమా? అయినా టీచర్లు ఉన్నది స్కూల్లో పాఠాలు చెప్పడానికా? లేక సర్కారు పనులన్నీ చేయడానికా? లక్షల మంది నిరుద్యోగులు పనుల్లేక అల్లాడు తున్నారు. వాళ్ళతో చేయించుకోవచ్చు కదా మీ సర్వేలు? అంటూ రాకేశ్ రెడ్డి మండిపడ్డారు.సామాజిక న్యాయం చేయడానికి తప్పనిసరిగా కులగణన జరగాలి.. కానీ, అందుకు ఇతర డిపార్ట్‌మెంట్‌లను వాడుకోవాలని సూచించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఒక్కరోజులోనే రాష్ట్రమంతా సమగ్ర కుటుంబ సర్వే చేశారని, కానీ ఈ ప్రభుత్వం బీసీల అంశాన్ని రాజకీయం చేసి కాలయాపన చేయడం కోసమే ఈ తంతు నడిపిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఏనుగుల రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## గత ప్రభుత్వం ఇచ్చిన టెండర్‌పై సర్కార్ కీలక నిర్ణయం



**హైదరాబాద్-నవభూమి:**గోదావరి ఫేజ్ 2లో భాగంగా హైదరాబాద్ శివార్లలో గత ప్రభుత్వం తలపెట్టిన కేశవాపురం రిజర్వాయర్ టెండర్ల విషయంలో సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. 2017లో ఇచ్చిన కేశవాపురం కాంట్రాక్టును రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గోదావరి జలాలను కొండపోచమ్మ సాగర్ నుంచి కేశవాపురం రిజర్వాయర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల పేరిట గత ప్రభుత్వం ప్రాజెక్టును డిజైన్ చేసిన విషయం తెలిసిందే. మెఘా ఇంజనీరింగ్? కంపెనీకి ఇచ్చిన ఈ కాంట్రాక్టును రద్దు చేస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ఇంజనీరింగ్ విభాగం బుధవారం జీవో జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో కేశవాపురం రిజర్వాయర్.. అందులో భాగంగా చేపట్టే పనులకు అయ్యే దాదాపు రూ.2 వేల కోట్ల ఖర్చు ఆదా కానుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

కొత్త ప్రతిపాదనలు

అదే ఖర్చుతో గోదావరి ఫేజ్ 2 స్కీమ్‌ను మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల వరకు పొడిగించి, హైదరాబాద్ గ్రేటర్ సిటీ తాగునీటి అవసరాలకు తాగునీటిని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలు తీసుకొచ్చింది. హైదరాబాద్‌కు 10 టీఎంసీల తాగు నీటిని సరఫరా చేయటంతో పాటు జంట జలాశయాలకు 5 టీఎంసీల నీటిని అందించేలా మల్లన్నసాగర్ నుంచి బహుళ ప్రయోజనాలుండేలా 15 టీఎంసీల నీటిని పంపింగ్ చేసే ప్రాజెక్టు చేపట్టాలని ఇటీవలే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. త్వరలోనే ఈ పనులకు టెండర్లు పిలవాలని హైదరాబాద్ వాటర్ బోర్డ్ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఆరేళ్లు అయినా...పాత టెండర్ల ప్రకారం ఎల్లంపల్లి నుంచి వచ్చే గోదావరి నీళ్లను మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్‌కు అక్కడి నుంచి లిఫ్ట్ చేసి కేశవాపురం చెరువును నింపుతారు. కేశవాపురం చెరువును 5 టీఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్‌గా నిర్మించనున్నారు. అక్కడి నుంచి ఘన్‌పూర్? మీదుగా హైదరాబాద్‌కు 10 టీఎంసీల తాగునీటి అవసరాలకు సరఫరా చేసేలా ప్లాన్‌ను సిద్ధం చేశారు. అయితే ఆరేండ్లై పనులు ప్రారంభంకానీ పరిస్థితి. భూసేకరణ చిక్కులతో పాటు అనాలోచితమైన అలైన్మెంట్ కారణంగా పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం అటవీ భూములు, రక్షణ శాఖ భూముల నుంచి ప్రాజెక్టును డిజైన్ చేయటం, ఎంచుకున్న పైపులైన్ రూట్ సరిగ్గా లేకపోవటంతో పనులు ముందుకు సాగలేదని రేవంత్ సర్కార్ చెబుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ టెండర్లను మెఘా కంపెనీ దక్కించుకుంది. అయితే టెండర్లను దర్కించుకున్నప్పటికీ పనులు చేపట్టకుండా మేఘా కంపెనీ వదిలేసింది.

ఫలితాలపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**టెండర్లు రద్దు చేస్తూ...**

2017 నాటి ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం పనులు చేపట్టలేమని.. 2024 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం అంచనాలను సవరించాలని మెఘా కంపెనీ ఇటీవలే ప్రభుత్వానికి లేఖ రాసింది. రేట్ల పెంపును తిరస్కరించటంతో పాటు ఇప్పటి వరకు పనులు చేపట్టని కారణంగా మెఘా కంపెనీకి కేటాయించిన టెండర్లను రద్దు చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో గ్రేటర్ సిటీకి తాగునీటి సరఫరాతో పాటు ఉస్మాన్ సాగర్?, హిమాయత్ సాగర్? నీటిని నింపేందుకు ఎక్కువ భాగం గ్రావిటీతో వచ్చేలా కొత్త అలైన్మెంట్ ప్రకారం పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## బతుకమ్మ చీరలు ఎలుకల పాలు.. ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



**ఆదిలాబాద్-నవభూమి:** తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ బతుకమ్మ. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పండుగపూట ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని బతుకమ్మ చీరల పంపిణీక శ్రీకారం చుట్టింది. ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తూ వస్తున్నది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాలన గాడి తప్పింది. తాజాగా ఆదిలాబాదజిల్లాలో బతుకమ్మ చీరలు ఎలుకల పాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తలమడుగు మండలానికి దీపావళి పండుగ ముందు 11,800 బతుకమ్మ చీరలు వచ్చాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఒకటి చొప్పున 18 సంవత్సరాలు నిండిన ఆదివాసీ మహిళలకు రెండు చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో చీరలు ఎలుకల పాలు కావడం పట్ల పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చీరలను త్వరగా పంపిణీ చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

# అగ్రరాజ్య పీఠంపై మళ్లీ ట్రంప్..!

**(1వపేజీ తరువాయి)**సమయంలో జపాన్, జర్మనీ, ఇటలీ వాసులను కట్టడి చేయడానికి దీనిని వాడేవారు. దీని ప్రకారం అక్రమ వలసదారులు అమెరికన్లను హత్య చేస్తే .. వారికి మరణదండన విధిస్తారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ర్యాలీలో కూడా ఇదే హామీ ఇచ్చారు. అక్రమ వలసల నిరోధంపైనే రిపబ్లికన్లు ఏకంగా 243 మిలియన్ డాలర్లు వెచ్చించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**యుద్ధ వ్యతిరేకి కావడం..**

ట్రంప్ విదేశాంగ విధానంలో యుద్ధాలకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడం ఓటర్లను ఆకర్షించిన అంశం. ఇప్పటికే ఉక్రెయిన్, గాజా యుద్ధాల్లో ఆ దేశం పాత్ర ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా కీవ్‌ను కాపాడేందుకు బిలియన్ల డాలర్ల సొమ్ము ఇవ్వడం సగటు అమెరికా వాసికి నచ్చలేదు. ట్రంప్ అధికారంలో ఉంటే రష్యాతో సరిగ్గా డీల్ చేసేవారని స్వింగ్ స్టేట్స్‌లో నిర్వహించిన సర్వేల్లో ఓటర్లు అభిప్రాయపడ్డారంటే పరిస్థితి అర్థమవుతుంది. చైనా విషయంలో బైడెన్ అత్యంత బలహీనంగా కనిపించారు. మరోవైపు గతంలో ఏ నిర్ణయాన్ని అయినా రెండో ఆలోచన లేకుండా స్థిరంగా తీసుకోవడం ట్రంప్‌నకు స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్ తీసుకొచ్చింది.

**ఆర్థిక వ్యవస్థ కూడా**

ట్రంప్‌ను విజయతీరాలకు చేర్చిన బలమైన అంశాల్లో ఆర్థిక వ్యవస్థ నిర్వహణ కూడా ఒకటి. 2020లో బైడెన్ అధికారం చేపట్టాక తీసుకొన్న నిర్ణయాలతో అమెరికా చాలా కాలం ద్రవ్యోల్బణం కారణంగా ధరల పెరుగుదలతో అవస్థపడింది. అప్పట్లో బైడెనామిక్స్ అంటూ డెమోక్రాట్ల విధానాలను హేళన చేసే పరిస్థితి తలెత్తింది. బైడెన్ పాలసీల కారణంగా తాము అవస్థలు పడ్డామని చాలా మంది ఓటర్లు న్యూయార్క్ టైమ్స్-సియానా కాలేజ్ పోల్‌లో వెల్లడించారు.

**గ్రామీణ ప్రాంతాల్లో పట్టు..**

ట్రంప్‌నకు అమెరికాలోని గ్రామీణ ఓటర్ల నుంచి బలమైన మద్దతు ఉంది. సర్వేలు ఎన్ని చెప్పినా అయోవా వంటి రాష్ట్రాల్లో ఆయనే విజయం సాధించడానికి ఇదే కారణంగా నిలిచింది. ఇక జార్జియా, కెంటకీ, నార్త్ కరోలినాల్లో ఇదే ఆయనకు ఆధిక్యం తీసుకొచ్చింది.

# వర్రా రవీంద్రారెడ్డిని వదిలేసిన పోలీసులు

**(1వపేజీ తరువాయి)** కేసుపై ఆయన ఆరా తీశారు.

వైకాపా అధికారంలో ఉండగా వర్రా రవీంద్రా రెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌లో పలు కేసులున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పులివెందులలో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కడపకు తీసుకొచ్చి రహస్యంగా విచారించారు. అనంతరం బుధవారం 41-ఏ నోటీసు ఇచ్చి పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలంటూ వదిలిపెట్టారు. మరో కేసులో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు మళ్లీ వెళ్లగా వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకున్నారు. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. రవీంద్ర ఆచూకీ కోసం బుధవారం కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకుని చింతకొమ్మదిన్నె పీఎస్‌లో విచారిస్తున్నారు.

**కడప జిల్లా ఎస్పీపై బదిలీ వేటు**

కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుపై ఏపీ ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. సోషల్ మీడియాలో వైసీపీ నేత వర్రా రవీంద్రారెడ్డి చేసిన పోస్టులపై ఫిర్యాదులు వచ్చినా సరైన చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. కేవలం నోటీసులు మాత్రమే ఇచ్చి ఆయనను వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

హర్షవర్ధన్ బదిలీపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. కడప జిల్లాలో మరో సీఐను కూడా ప్రభుత్వం సస్పెండ్ చేసింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలపై రవీంద్రారెడ్డి గతంలో అసభ్యకర పోస్టులు పెట్టిన సంగతి తెలిసిందే.

## అల్లు అర్జున్‌కు ఊరట.. కేసును కొట్టివేసిన ఏపీ హైకోర్టు



**అమరావతి-నవభూమిబ్యూరో:** ప్రముఖ సినీనటుడు అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. నంద్యాల పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసును ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల సమయంలో నంద్యాలలో వైకాపా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంటికి అల్లు అర్జున్ వెళ్లారు.

ఆయనను చూడటానికి అధిక సంఖ్యలో ప్రజలు చేరారని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమేనని పేర్కొంటూ నంద్యాల రూరల్ డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రరావు ఈ ఏడాది మే 11న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అల్లు అర్జున్, రవిచంద్ర కిశోర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఇటీవల అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. నంద్యాల పోలీసుల ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసింది.

## మద్దెల చెరువు సూరి హత్య కేసులో బిగ్ ట్విస్ట్!... భాను విడుదల!

**చంచల్ గూడ-నవభూమి:** మద్దెల చెరువు సూర్యనారాయణ రెడ్డి అలియాస్ మద్దెల చెరువు సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడు భాను కిరణ్ విడుదలయ్యాడు.మద్దెల చెరువు సూర్యనారాయణ రెడ్డి అలియాస్ మద్దెల చెరువు సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడు భాను కిరణ్ విడుదలయ్యాడు. సుమారు 12 ఏళ్ల తర్వాత చంచల్ గూడ జైలు నుంచి భాను కిరణ్ బయటకు వచ్చాడు. సూరి హత్య కేసులో జైలులో ఉన్న భానుకు ఇటీవల కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో నేడు జైలు నుంచి భాను విడుదలయ్యాడు. అవును... మద్దెల చెరువు సూరి హత్య కేసులో నిందితుడు భాను కిరణ్ కు బెయిల్ లభించిన సంగతి తెలిసిందే! సీఐడీ ఆర్మ్స్ యాక్ట్ కేసులో నాంపల్లి కోర్టు భానుకు బెయిల్ మంజూరు చేసింది. వాస్తవానికి సూరి మర్డర్ కేసులో కోర్టు జీవిత ఖైదు విధించడంతో 12 ఏళ్లుగా అతడు చంచల్ గూడ జైల్లోనే ఉంటున్నాడు. 2011 జనవరి 4న మద్దెల చెరువు సూరిని భాను హత్య చేశాడు! అప్పట్లో ఈ వార్త పెను సంచలనంగా మారింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే పరిటాల రవి హత్య కేసులో మద్దెల చెరువు సూరి నిందితుడిగా ఉన్నాడు. అయితే.. 2011 జనవరి 4న హైదరాబాద్ లోని నవోదయా కాలనీ ప్రాంతంలో సూరిని భాను కాల్చి చంపాడు.

## తెలంగాణలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

**(1వపేజీ తరువాయి)**సహకరించాలని శ్రీధర్‌బాబు కోరారు.

**సర్వే సమయంలో ఎలాంటి పత్రాలు స్వీకరించరు: మంత్రి పొన్నం**

ప్రభుత్వం ఇంటింటి సర్వే పేరుతో మహత్తర కార్యక్రమం చేపట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల సహకారం ఉంటే కార్యక్రమాలు విజయవంతమవుతాయని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా సమాచారం ఇచ్చి సహకరించాల్నారు. అందరి సలహాల మేరకు ప్రశ్నలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇంటింటి సర్వేతో రాష్ట్రం రోల్‌మోడల్‌గా మారబోతుందని చెప్పారు. సర్వే సమయంలో ఎలాంటి పత్రాలు స్వీకరించరన్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**(1వపేజీ తరువాయి)**కులగణన సర్వే చేస్తోందని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 21వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు.. 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. చదువుతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని. అందుకే విద్యార్థి, నిరుద్యోగుల కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం వివరించారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామన్నారు. చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించేలా ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు.వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని, గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా డయల్ 100కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా చిన అప్పల నాయుడు

**(1వపేజీ తరువాయి)**సంస్థల ప్రతినిధులుగా గెలుపొందిన వారు ఉన్నారు. పార్టీ అభ్యర్థి చినఅప్పలనాయుడు సుమారు నాలుగుదశాబ్దాలుగా ప్రజాజీవితంలో ఏమండీ కొనసాగుతున్నారు. బొబ్బిలి నుంచి 4 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన శంబంగి వెంకట చినఅప్పలనాయుడు 2019లో ప్రొటెం స్పీకర్‌గా పనిచేశారు.

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్

**(1వపేజీ తరువాయి)**ప్రధానంగా లాభపడ్డాయి. టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.44 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2733 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది.

## ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లుకు ఏపీ కేబినెట్ ఆమోదం

**(1వపేజీ తరువాయి)**దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందన్నారు. డ్రోన్ రంగంలో పరిశోధన చేసే విద్యా సంస్థలకు రూ.20 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ఏపీ కేబినెట్ నిర్ణయించిందన్నారు. ప్రపంచ డ్రోన్ డెస్టినేషన్‌గా ఆంధ్రప్రదేశ్, డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లును అభివృద్ధి చేయబోతున్నట్లు వెల్లడించారు. 300 ఎకరాల్లో డ్రోన్ తయారీ, టెస్టింగ్, ఆర్అండ్‌డీ ఫెసిలిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. 25 వేల మందికి

డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇస్తామన్నారు. 50 డ్రోన్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు.

**మరిన్ని క్యాబినెట్ నిర్ణయాలు**

ఎక్సైజ్ చట్ట సవరణ ముసాయిదాకు, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యాల సాధనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం

సీఆర్డీఏ పరిధిని 8,352 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ఆమోదం

సీఆర్డీఏ పరిధిలోకి పల్నాడు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి 154 గ్రామాలు.11 మండలాల్లోని 154 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి తెస్తూ ఆమోదంజ్యుడిషియల్ అధికారుల ఉద్యోగ విరమణ వయసు 61కి పెంచుతూ ఆమోదం2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

## ఎన్నిసార్లు చెప్పాలి..?

**(1వపేజీ తరువాయి)**మంత్రులకు ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని వార్నింగ్ ఇచ్చారు. మెతక వైఖరి విడనాడాలని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో విమర్శలు ఎదుర్కొన్న కొందరు అధికారులు ఇప్పటికీ తీరు మార్చుకోలేదని... అలాంటి వారి కారణంగా మనం విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందని చంద్రబాబు అన్నారు.

మరోవైపు కేబినెట్ సమావేశంలో సోషల్ మీడియాలో పోస్టులపై చర్చ జరిగింది. ఈ అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేవనెత్తారు. కొంతమంది వైసీపీ నేతలు పదేపదే పోస్టులు పెడుతున్నారని... వారిపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఫోన్ చేసినా కొందరు ఎస్పీలు స్పందించడం లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ కు అనుకూలంగా పని చేసిన కొందరు పోలీసు అధికారులు ఇప్పటికీ కీలక పోస్టుల్లో ఉన్నారని చెప్పారు. కింది స్థాయిలో ఉన్న డీఎస్పీలు, సీఐలపై నెపం నెట్టి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఇళ్లలో ఉన్న మహిళలపై కూడా పోస్టులు పెడుతున్నారని... అందుకే తాను రియాక్ట్ కావాల్సి వచ్చిందని చెప్పారు.


## వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు ఎదురుదెబ్బ

**అమరావతి-నవభూమి:** వైకాపాకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మరియమ్మ అనే మహిళ హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది.తుళ్లూరు మండలం వెలగపూడిలో 2020 డిసెంబర్‌లో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రాళ్లు రువ్వుకున్న ఘటనలో వెలగపూడికి చెందిన మరియమ్మ మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో తుళ్లూరు ఠాణాలో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నందిగం సురేశ్‌ను పోలీసులు 78వ నిందితుడిగా చేర్చారు. బెయిలు మంజూరు చేయాలని చేసిన అభ్యర్థనను గుంటూరు కోర్టు తోసిపుచ్చడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. సురేశ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in



## వారానికి రెండు రోజుల వ్యాయామంతో మెదడు వ్యాధులు దూరం!



**న్యూఢిల్లీ–నవభూమి:** శారీరక వ్యాయామం మెదడును నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా అడ్డుకుంటుందని తాజా అధ్యయనం వెల్లడించింది. వ్యాయామం వల్ల మెదడు పెద్దదవుతుందని తెలిపింది. వారానికి రెండు, మూడు రోజులు చేసే తక్కువ స్థాయి మొదలుకొని తీవ్ర వ్యాయామానికి, మెదడులోని మొత్తం భాగాలకు సంబంధం ఉంటుందని కెనడియన్–అమెరికన్ పరిశోధన బృందం తెలిపింది. జ్ఞాపకశక్తి, గ్రహణ శక్తిలో కీలకమైన హిప్పోక్యాంపస్, టెంపోరల్ లోబ్‌లలో పెరుగుదల ఉంటుందని చెప్పింది. అధ్యయనంలో పాల్గొన్నవారి



మెదళ్ల ఎంఆర్ఐ స్కాన్లను డీప్–లెర్నింగ్ న్యూరల్ నెట్‌వర్క్ సాయంతో పరిశీలించి మెదడు బరువులోని మార్పులను పరిశోధకులు విశ్లేషించారు. మిత లేదా తీవ్ర వ్యాయామం చేసిన రోజుల్లో మెదడు బరువు పెరగడాన్ని గమనించారు. వ్యాయామం సందర్భంగా విడుదలయ్యే బీడీఎన్ఎఫ్ ప్రొటీన్ మెదడు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. ఇది మెదడును నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడకుండా చేసే కీలక అంశాల్లో ఒకటి కావొచ్చని అభిప్రాయపడ్డారు. రోజువారీ తేలికపాటి వ్యాయామాలు కూడా మెదడు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని వెల్లడించారు.

## బాలికను కారులో మరిచి డోర్ లాక్ చేసిన ఆర్మీ వ్యక్తి.. ఊపిరాడక చిన్నారి మృతి



**లక్నో–నవభూమి:** బాలికను కారులో తీసుకెళ్లిన ఆర్మీ వ్యక్తి అందులో మరిచిపోయాడు. కారు డోర్ లాక్ చేసి ఫ్రెండ్స్‌తో వెళ్లిపోయాడు. దీంతో ఊపిరాక ఆ చిన్నారి మరణించింది. ఆర్మీ అధికారి అయిన బాలిక తండ్రి ఫిర్యాదుతో ఆ ఆర్మీ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హర్యానాలోని జింద్ జిల్లా నిదానీ గ్రామానికి చెందిన సోంబీర్ పూనియా గత నాలుగేళ్లుగా మీరట్‌లోని ఆర్డినెన్స్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఫజల్‌పూర్‌లోని ఆర్మీ కాలనీలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. మూడేళ్ల వర్తిక, మూడు నెలల భవి అతడి కుమార్తెలు.

కాగా, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన లాన్స్ నాయక్ నరేష్ అదే ఆర్మీ క్వార్టర్స్‌లో నివసిస్తున్నాడు. సోంబీర్ కుటుంబానికి పరిచయం ఉన్న అతడు అక్టోబర్ 30న ఇంటి బయట ఆడుకుంటున్న వర్తికను చూశాడు. ఆ చిన్నారిని తన కారులో బయటకు తీసుకెళ్తానని సోంబీర్ భార్య రీతూకు చెప్పాడు. తొలుత నిరాకరించిన ఆమె ఆ తర్వాత అంగీకరించింది. మరోవైపు నరేష్ ఆ బాలికను తన కారులో తీసుకెళ్లాడు. కంకేర్‌ఖేడాలో రోహటా రోడ్డు వద్ద కారు ఆపాడు. పాపను కారులో మరిచి డోర్ లాక్ చేశాడు. ఫ్రెండ్స్‌ను కలిసి పార్టీలో బిజీ అయ్యాడు. ఆ తర్వాత డ్యూటీకి వెళ్లిపోయాడు. అయితే తమ పాప ఇంటికి చేరకపోవడంతో ఆర్మీ అధికారి సోంబీర్ కుటుంబం ఆందోళన చెందింది. నరేష్‌కు ఫోన్ చేయగా తాను డ్యూటీలో ఉన్నానని చెప్పాడు. దీంతో కుమార్తె మిస్సింగ్‌పై ఆ ప్రాంత పోలీసులకు సోంబీర్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ కారు వద్దకు చేరుకుని పరిశీలించారు. ఊపిరాడక చనిపోయిన చిన్నారిని కారు లోపల గుర్తించారు. పోస్ట్‌మార్టం కోసం పాప మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్మీకి చెందిన నరేష్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్షమాపణ చెప్పండి లేదా 5 కోట్లు చెల్లించండి.. సల్మాన్‌కు మరోసారి బెదిరింపు



**న్యూఢిల్లీ–నవభూమి:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు మరోసారి బెదిరింపు సందేశం వచ్చిందని ముంబై పోలీసులు మంగళవారం తెలిపారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడిగా చెప్పుకున్న ఓ వ్యక్తి నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ బెదిరింపు సందేశం వచ్చింది. 'సల్మాన్‌ఖాన్ బతికి ఉండాలనుకొంటే, అతడు మా(బిష్ణోయ్ వర్గం) గుడికి వెళ్లి క్షమాపణ చెప్పాలి లేదా రూ.5 కోట్లు చెల్లించాలి. అలా చేయకుంటే, మేం అతడిని చంపేస్తాం' అని సందేశంలో ఉంది.

## ఉత్తరకొరియా బలగాలతో ఉక్రెయిన్ సైన్యం ఢీ

**కీవ్–నవభూమి::** రష్యాకు మద్దతుగా యుద్ధ రంగంలోకి దిగిన ఉత్తర కొరియా సైనిక బలగాలతో తమ సైన్యం తొలిసారి తలపడిందని ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఉమెరోవ్ మంగళవారం ప్రకటించారు. ఒక్కొక్కటి 3 వేల మంది సైనికులతో కూడిన ఐదు ఉత్తరకొరియా సైనిక యూనిట్లను రష్యా ప్రభుత్వం కుర్స్ సరిహద్దులో మోహరించిందని ఉమెరోవ్ చెప్పారు. కుర్స్‌లో ఉత్తర కొరియా సైన్యం పైకి ఫిరంగి కాల్పులతో ఉక్రెయిన్ ఆర్మీ విరుచుకుపడిందని కీవ్ అధికారి ఒకరు తెలిపారు.

## ముడా కేసులో సిద్ధూకు నోటీసులు



**న్యూఢిల్లీ–నవభూమి:** ముడా స్కామ్ కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు ఆ రాష్ట్ర హైకోర్టు మంగళవారం నోటీసులు జారీచేసింది. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి క్రిష్ణ ఈ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు దర్యాప్తునకు సంబంధించిన రికార్డును కోర్టుకు సమర్పించాలని జస్టిస్ ఎం నాగప్రసన్న లోకాయుక్తను ఆదేశించారు. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి సీఎంతో పాటు ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీబీఐ, లోకాయుక్తకు కూడా న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 26కు వాయిదా వేసింది.

**నేడు సిద్ధరామయ్య విచారణ**

ముడాకు చెందిన 14 స్థలాలను అక్రమంగా తన భార్య పేరున మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నుంచి కేటాయించుకున్నట్టు కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆరోపణలున్న విషయం తెలిసిందే. గతంలో ఆమె నుంచి ప్రభుత్వం 3.16 ఎకరాల భూమి తీసుకుని దానికి బదులుగా 50:50 శాతం విధానంలో ఆమెకు ముడా 14 ప్లాట్లను కేటాయించింది.

అయితే ఆమె తీసుకున్న భూమి కన్నా ఈ ప్లాట్ల విలువ ఎన్నో రెట్లు అధికమని, పైగా కాసర గ్రామంలో ప్రభుత్వం తీసుకున్న 3.16 ఎకరాల భూమిపై ఆమెకు చట్టబద్ధంగా ఎలాంటి హక్కు లేదని ఆరోపణలు వచ్చాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న లోకాయుక్త పోలీసులు ఆయనను ఒకటో ముద్దాయిగా, ఆయన భార్య పార్వతిని రెండో ముద్దాయిగా చేర్చారు. కాగా, ఆమెను గత నెల 25న లోకాయుక్త విచారించగా, నవంబర్ 6న తమ ముందు విచారణకు హాజరు కావాలంటూ సీఎం సిద్ధరామయ్యకు నోటీసులు జారీ చేసింది.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి రూ.16 కోట్ల ఇంజక్షన్



**న్యూఢిల్లీ–నవభూమి:** అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి సరైన సమయంలో చికిత్స అందించి వైద్యులు ప్రాణం పోశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దిన్ ముహమ్మద్ అనే చిన్నారి గత కొద్దికాలంగా స్పైనల్ మస్కులర్ అట్రోఫీ అనే అరుదైన జన్యు వ్యాధితో బాధపడుతున్నాడు. చిన్నారికి ఆరు నెలల వయస్సు ఉన్నప్పుడే అతని చేతులు, కాళ్లు కదపలేకపోవడం తన తల్లి గమనించింది. తల ఎత్తడం, కూర్చోవడం కూడా కాష్టంగా మారింది. దీంతో తల్లిదండ్రులు వైద్యులకు చూపించగా.. 'స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ' వ్యాధి ఉన్నట్లు గుర్తించారు.

అరుదైన ఈ వ్యాధికి రెండేళ్లు నిండకుండా కొన్ని రకాల ఔషధాలు వాడితేనే చికిత్సకు వీలవుతుందని కోల్‌కతా వైద్యులు సూచించారు. ఈ వ్యాధిని నయం చేయాలంటే నొవార్టిస్ ఫార్మా తయారు చేసిన రూ.16 కోట్లు ఖరీదైన జొల్జెన్‌స్మా ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అయితే, వారి వద్ద అంత డబ్బు లేకపోవడంతో.. దాతలు, ప్రభుత్వ సాయంతో తాజాగా బాలుడికి ఆ ఇంజక్షన్ ఇచ్చారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు కోల్‌కతా వైద్యులు తెలిపారు.

**స్పైనల్ మస్క్యులర్ అట్రాఫీ గురించి..**

ఎస్ఎంఏ.. స్పైనల్ మస్క్యులార్ ఆట్రోఫీ.. ఇదొక నరాల వ్యాధి. ఇది ప్రపంచంలోనే అత్యంత అరుదైన వ్యాధి. కండరాలు బలహీనంగా ఉండటం, శరీరంలోని ఏదో ఒక అవయవంలో కదలికలు లేకపోవడం దీని ప్రధాన లక్షణం. చికిత్స తీసుకోకుంటే అనారోగ్యం తీవ్రమై మంచానికే పరిమితమవ్వాల్సి ఉంటుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా దక్కవు. అయితే, ఈ వ్యాధికి చికిత్స చాలా ఖర్చుతో కూడుకున్నది. ఎస్ఎంఎన్ అనే జన్యువు లోపం వల్ల వస్తుంది. సాధారణంగా పుట్టిన ప్రతి వ్యక్తికి ఎస్ఎంఎన్ అనే జన్యువు ద్వారానే ఎస్ఎంఎన్ ప్రొటీన్ ఉత్పత్తి జరుగుతుంది. ఈ ప్రొటీన్ వల్ల వెన్నెముకలో ఉండే 'ఆంటీరియర్ హాన్' అనే నరాలకు సంబంధించిన కణాలు బలపడుతూ ఉంటాయి. అయితే, ఎస్ఎంఎన్ జన్యులోపం వల్ల సదరు ప్రొటీన్ ఉత్పత్తి అవసరమైనంత మేర జరగదు. దీనివల్ల వ్యాధి పీడితులైన పిల్లల్లో కాళ్లు, చేతులు, నడుము, మెడ భాగంలోని కండరాలు నిర్జీవంగా మారతాయి. ఫలితంగా ఆ పసిబిడ్డలు శాపగ్రస్థమైన బాల్యాన్ని అనుభవిస్తారు. ఈ వ్యాధిని నయం చేయాలంటే నొవార్టిస్ ఫార్మా తయారు చేసిన రూ.16 కోట్లు ఖరీదైన జొల్జెన్‌స్మా ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రపంచంలోనే ఇది అత్యంత ఖరీదైన ఔషధం. ఇది మనదేశంలో దొరకదు. విదేశాల నుంచి తెప్పించుకోవాల్సి ఉంటుంది. అయితే బిడ్డ పుట్టిన రెండేళ్ల లోపే దీన్ని తీసుకోవాలి. ఇది అంత ఈజీగా ఇవ్వరు. మెడికల్ ప్రిస్క్రిప్షన్, లేదా పిల్లల వైద్యుడి నుంచి ఒక లేఖను పంపితే వారు పరిశీలించి ఇంజక్షన్ ఇచ్చేందుకు అనుమతిస్తారు. ఇప్పటికే ఇలాంటి కేసులు మన దేశంలో చాలానే వెలుగు చూశాయి. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విరాళాల ద్వారానే ఆ ఇంజక్షన్ తెప్పించుకుని తమ చిన్నారి ప్రాణాలను కాపాడుకున్నారు.

**మూడు రకాలు**

ఎస్ఎంఏ వ్యాధి ప్రాథమికంగా మూడు రకాలు.. టైప్–1, టైప్–2, టైప్–3. ఇందులో ఒక్కో రకమైన వ్యాధి ఒక్కో లక్షణాన్ని కలిగి ఉంటుంది. సరైన సమయంలో సమర్థమంతమైన చికిత్స అందకపోతే మరణశాసనమే.

**టైప్–1**

ఎస్ఎంఏ టైప్–1 మిగిలిన రెండిటికంటే తీవ్రమైనది. అధికశాతం పిల్లల్లో ఈ లోపం వల్ల ఎస్ఎంఎన్ అనే ప్రొటీన్ తగినంత ఉత్పత్తి కాదు. దీనివల్ల వెన్నెముకలోని 'ఆంటీరియర్ హాన్ సెల్స్' అనే నరాల కణాలు బిడ్డ వయసు పెరిగేకొద్దీ బలహీనమవుతాయి. ఫలితంగా కాళ్లు, చేతులు, నడుము, మెడ భాగంలోని కండరాలు సత్తువను కోల్పోతాయి. దీంతో ఇతర పిల్లల్లా చకచకా నడవలేరు. మెడలు నిటారుగా నిలబెట్టలేరు. కూర్చోలేరు, నిలబడలేరు. ఊపిరి తీసుకునేందుకు సహకరించే శ్వాస కండరాలు సైతం బిడ్డ పెరిగే కొద్దీ బలహీనపడతాయి. దీంతో, శ్వాస ఆడదు. శిశువు రెండు సంవత్సరాలకు మించి బతికే అవకాశాలు తక్కువ. కాబట్టి, వ్యాధి లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలి. తక్షణం చికిత్స ప్రారంభించాలి.

**టైప్–2**

ఎస్ఎంఏ టైప్–2 పిల్లలు కూర్చోగలుగుతారు కానీ, నడవలేరు. వీరిలో కూడా వయసు పెరిగేకొద్దీ సమస్య తీవ్రం అవుతుంది. అడుగులు వేయడానికి కూడా ఇబ్బందిపడతారు.

**టైప్–3**

ఎస్ఎంఏ టైప్–3 పిల్లల్లో సమస్య స్వల్పంగా ఉంటుంది. కూర్చోగలుగుతారు కానీ పైకి లేవలేరు. మెట్లు ఎక్కలేరు. ఈ రుగ్మత మేనరికం వల్ల రావచ్చు. మేనరికం లేకపోయినా కూడా వచ్చే అవకాశం ఉంది.

ప్రధాన లక్షణాలు

వయసుకు తగినట్టుగా కాళ్లు, చేతుల్లో కదలికలు లేకపోవడం.

మెడ నిలబడకపోవడం.

కుదురుగా కూర్చోలేకపోవడం.

నిటారుగా నిలబడలేకపోవడం.

తడబాటు లేకుండా నడవలేకపోవడం.

**నిర్ధారణ పరీక్షలు**

నర్వ్ కండక్షన్ స్టడీస్. ఎస్ఎంఎన్ జన్యు పరీక్ష (రక్త పరీక్ష). ఈ రెండూ రుగ్మతను నిర్ధారిస్తాయి.

ఎస్ఎంఎన్ జన్యువు నుంచి ఎస్ఎంఎన్–1, ఎస్ఎంఎన్–2 ప్రొటీన్స్ ఉత్పత్తి అవుతాయి. ఎస్ఎంఏ ఉన్న పిల్లలో ఎస్ఎంఎన్–1 అనే ప్రొటీన్ పూర్తిగా లోపించి ఉంటుంది. అలాగే, ఎస్ఎంఎన్–2 ప్రొటీన్ మోతాదును బట్టి వ్యాధి తీవ్రత, లక్షణాలు మారుతూ ఉంటాయి. ఆ ప్రొటీన్ అధికంగా ఉన్నవారిలో వ్యాధి తీవ్రత తక్కువగా, తక్కువగా ఉన్నవారిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటున్నట్టు అనేక అధ్యయనాలు నిరూపించాయి.

**చికిత్స**

ఎస్ఎంఏ చికిత్సలో ప్రస్తుతం మూడు రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

**1. స్పిన్రాజా**

ఏడేళ్ల క్రితం వరకూ ఈ వ్యాధికి ఎలాంటి చికిత్సా లేదు. ఒక్కసారి నిర్ధారిస్తే.. డెత్ సర్టిఫికెట్ సిద్ధం అయినట్టే. ఆ సమయంలోనే..'స్పిన్రాజా' అనే మందు అందుబాటులోకి వచ్చింది. దీనిని వెన్నెముకకు ఇంజక్ట్ చేస్తారు. ఈ ఔషధాన్ని ఇవ్వడానికి వయో పరిమితి అంటూ లేదు. కాకపోతే, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి చొప్పున జీవితాంతం వాడాల్సి ఉంటుంది. ఇందుకుగాను, ఏడాదికి రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ మందు అమెరికాలో మాత్రమే లభిస్తుంది. దీన్ని క్రమబద్ధంగా వాడటం వల్ల శరీరంలో ఎస్ఎంఎన్–2 ప్రొటీన్ మోతాదు పెరుగుతుంది.

**2. జీన్‌థెరపీ (జోల్జనెస్మా)**

ఐదేళ్ల క్రితం జీన్ థెరపీ (జోల్జనెస్మా) అందుబాటులోకి వచ్చింది. ఈ ఔషధం కూడా అమెరికాలో మాత్రమే లభిస్తుంది. జోల్జనెస్మా మందుతో కృత్రిమంగా తయారైన ఎస్ఎంఎన్–1 అనే జీన్‌ను వైరల్ వెక్టర్‌తో కలగలిపి ఇంజక్షన్ ద్వారా రోగి రక్తంలోకి ఎక్కిస్తారు. రెండు సంవత్సరాల్లోపు పిల్లలకు మాత్రమే జీన్ థెరపీ ఇస్తారు. జోల్జనెస్మా సింగిల్ డోస్ తీసుకుంటే చాలు. అంటే, ఒక్కసారి తీసుకుంటే సరిపోతుంది. దీని ఖరీదు రూ.16 కోట్లు.

**3. రిస్‌డిప్లామ్**

'రిస్‌డిప్లామ్' అనే మందు నాలుగేళ్ల క్రితమే అందుబాటులోకి వచ్చింది. ఇది పౌడర్ రూపంలో ఉంటుంది. సిరప్‌లా రోజూ నోటిద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. మన దేశంలోనూ లభిస్తున్నది. ఈ ఔషధాన్ని తీసుకోవడానికి వయోపరిమితి లేదు. జీవితాంతం వాడాల్సిందే. ఇందుకుగాను ఏడాదికి రూ. 40 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఖర్చవుతుంది. ఇది కూడా ఎస్ఎంఎన్–2 ప్రొటీన్ మోతాదును పెంచుతుంది. ఈ చికిత్సలను పిల్లలకు ఎంత తక్కువ వయసులో ప్రారంభిస్తే, అంత మంచి ఫలితాలు ఉంటాయి. లేకపోతే, వయసు గడిచేకొద్దీ వెన్నుపూసలోని కణాల క్షీణత మొదలవుతుంది.

**మల్టీ డిసిప్లినరీ కేర్..**

డిసిప్లినరీ కేర్ తప్పనిసరి. ఆర్థో, పల్మనాలజీ, ఫిజియోథెరపీ, న్యూట్రిషన్, గ్యాస్ట్రో తదితర విభాగాల నిపుణుల సమన్వయంతో వైద్యం చేయించాలి. మందులు ఇవ్వడం ఒక ఎత్తు అయితే, మల్టీడిసిప్లినరీ కేర్ మరో ఎత్తు. కొన్ని వైద్యశాలలలో మాత్రమే ఈ మూడు రకాల మందులూ ఇస్తున్నారు. కొన్ని కార్పొరేట్ దవాఖానాలు పేరెంట్ సపోర్ట్ గ్రూప్‌లను కూడా అందుబాటులోకి తెస్తున్నాయి. ఈ గ్రూప్‌లోని సభ్యులు కొత్తగా నమోదైన రోగుల తల్లిదండ్రులకు ధైర్యం చెబుతారు, అవసరమైన సమాచారాన్ని అందిస్తారు, తమ వంతు నైతిక మద్దతు ప్రకటిస్తారు. దీనివల్ల ఎంతోకొంత సాంత్వన లభిస్తుంది.

## ఆర్టికల్ 370 పునరుద్ధరణపై చర్చలు జరుపాలి



**శ్రీనగర్: –నవభూమి:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. 2019 ఆగస్ట్ 5న జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది.%కాగా, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించే తీర్మానాన్ని జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టారు. 'జమ్ముకశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను కాపాడే ప్రత్యేక హోదా, రాజ్యాంగ హామీ ప్రాముఖ్యతను ఈ శాసనసభ పునరుద్ఘాటిస్తుంది. ఏకపక్ష తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ ఐక్యత, జమ్ముకశ్మీర్ ప్రజల ఆకాంక్షలు రెండింటినీ కాపాడాలి. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి' అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు, సభలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. 'దేశంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయం (పార్లమెంట్) ఈ చట్టాన్ని ఆమోదించింది' అని ఆయన అన్నారు. ఈ తీర్మానం ప్రతులను బీజేపీ సభ్యులు చించారు. పేపర్ ముక్కలను వెల్‌లోకి విసిరారు. లంగేట్ ఎమ్మెల్యే షేక్ ఖుర్షీద్ వెల్ లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు. అయితే ఈ గందరగోళం మధ్య స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. అసెంబ్లీలోని మెజారిటీ సభ్యులు దీనికి మద్దతిచ్చారు. దీంతో ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. గందరగోళం కొనసాగడంతో 15 నిమిషాల పాటు సభ వాయిదా పడింది.

## కర్ణాటకలో లిక్కర్ స్కామ్!



**న్యూఢిల్లీ–నవభూమి:** కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్‌లకు అడ్డాగా మారిపోయింది. ముడా, వాల్మీకి, కేఐఏడీబీ, వక్ఫ్ కుంభకోణాలతో ఇప్పటికే పీకల్లోతు చిక్కుల్లో కూరుకుపోయిన సీఎం సిద్ధరామయ్య సర్కారుకు కొత్తగా మద్యం స్కామ్ మంటలు అంటుకొన్నాయి. ఎక్సైజ్ మంత్రి ఆర్బీ తిమ్మాపూర్ కనుసన్నల్లో రూ. 700 కోట్ల మేర మద్యం కుంభకోణం చోటుచేసుకొన్నదని కర్ణాటక వైన్ మర్చంట్స్ అసోసియేషన్ సంచలన ఆరోపణలు చేసింది. ఎక్సైజ్ శాఖలో నెలకొన్న అవినీతిని కట్టడి చేయాలంటూ గవర్నర్ కార్యాలయం, చీఫ్ సెక్రటరీ, కర్ణాటక లోకాయుక్తకు అసోసియేషన్ ఓ లేఖలో, ఈ–మెయిల్‌లో విజ్ఞప్తి చేసింది.

ఈ–మెయిల్‌లో ఏమున్నది?..ఇంగ్లిష్ న్యూస్ వెబ్‌సైట్ ఇండియా టుడే కథనం ప్రకారం.. అసోసియేషన్ ఈ–మెయిల్‌లో కింది విధంగా ఆరోపణలు చేసింది. 'రాష్ట్రంలోని ఎక్సైజ్ శాఖలో పెద్దయెత్తున అవినీతి రాజ్యమేలుతున్నది. ఎక్సైజ్ శాఖామాత్యులు తిమ్మాపూర్, శాఖలోని ఉన్నతాధికారులు నిబంధనలకు విరుద్ధంగా, దోపిడీకి పాల్పడుతున్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఎవరైనా అధికారులు బెంగళూరు పరిధిలో బదిలీ కోరుకొంటే మంత్రి తిమ్మాపూర్ ఆయా అధికారుల నుంచి పెద్దయెత్తున డబ్బును లంచంగా స్వీకరించేవారు. ట్రాన్స్‌ఫర్ నిమిత్తం అవసరమైన ఆ డబ్బు కోసం సదరు అధికారులు మద్యం దుకాణాల యజమానుల నుంచి వసూళ్లకు తెగబడేవారు. సీఎల్7 బార్ (బార్లు, రెస్టారెంట్లకు కర్ణాటకలో ఇచ్చే లైసెన్సులు) లైసెన్సు కావాలంటే, నిబంధనల ప్రకారం.. ఏడాదికి రూ. 4 లక్షల నుంచి రూ. 8.5 లక్షల వరకూ చెల్లించాలి. అయితే, అధికారుల సాయంతో మంత్రి తిమ్మాపూర్ మాత్రం లిక్కర్ షాప్ యజమానుల నుంచి సీఎల్7 లైసెన్స్ కోసం రూ.30–70 లక్షల వరకూ లంచం రూపంలో అదనంగా వసూలు చేసేవారు. ఇది చట్టానికి విరుద్ధం. గడిచిన ఏడాది వ్యవధిలో ఇలా దాదాపు వెయ్యి లైసెన్సుల ద్వారా రూ.300 కోట్ల నుంచి రూ.700 కోట్లకు పైగా మంత్రి అవినీతికి పాల్పడ్డారు. ఇక, ఎక్సైజ్ శాఖలో బదిలీల కోసం ఒక్కరోజులోనే ముగ్గురు డిప్యూటీ కమిషనర్లు, తొమ్మిది మంది సూపరింటెండెంట్స్, 13 మంది డిప్యూటీ సూపరింటెండెంట్స్ ఆఫ్ ఎక్సైజ్, 20 మంది ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి మంత్రి తిమ్మాపూర్ రూ.16 కోట్ల వరకూ వసూళ్లు చేశారు. కింది స్థాయి అధికారుల బదిలీ కోసం ఒక్కో డిప్యూటీ కమిషనర్ రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు వసూలు చేసేవారు. డిప్యూటీ కమిషనర్ బదిలీ కోసం మంత్రి తిమ్మాపూర్ రూ.3 కోట్ల వరకూ వసూలు చేసేవారు. ఇదో పెద్ద కుంభకోణం. దీనిపై సత్వర విచారణ జరిపించాలని కోరుకొంటున్నాం' అంటూ 'హ్యూజ్ బ్రైబ్ అండ్ మనీలాండరింగ్ టుక్ ప్లేస్ ఇన్ ఎక్సైజ్ మినిస్టర్ ఆఫీస్ బెంగళూరు ఇన్ ట్రాన్స్‌ఫరింగ్ ఎక్సైజ్ ఆఫీసర్స్ అండ్ టు కంట్రోల్ ఇల్లీగల్ కలెక్షన్ ఆఫ్ మనీ ఫర్ ఎలక్షన్ పర్పస్ ఫ్రమ్ ఎక్సైజ్ అఫీషియల్' పేరిట అసోసియేషన్ ఈ–మెయిల్‌లో పేర్కొంది. లంచంగా స్వీకరించిన డబ్బును మంత్రి తిమ్మాపూర్ ఎన్నికల్లో వాడినట్టు ఆరోపించింది. దీనిపై గవర్నర్ కార్యాలయం ఆదేశాలతో లోకాయుక్త పోలీసులు దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. కాగా, 2013–18 మధ్య సిద్ధరామయ్య సీఎంగా ఉన్నప్పుడు కర్ణాటకలో వెలుగుచూసిన టీఏ/డీఏ స్కామ్‌లోనూ ఆర్బీ తిమ్మాపూర్ ప్రధాన నిందితుడిగా ఉండటం గమనార్హం.

# ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. రోజురోజుకూ కాలుష్యం తీవ్రమవుతోంది. కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. దేశ రాజధాని నగరంలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో గాలి నాణ్యత సూచి 358గా నమోదైంది. అలీపూర్‌లో ఏక్యూఐ 372గా, బావన ప్రాంతంలో 412, ద్వారకా సెక్టార్ 8లో 355, ముంద్కాలో 419, నజాఫ్‌గఢ్ ప్రాంతంలో 354, న్యూ మోతి భాగ్‌లో 381, రోహిణిలో 401, పంజాబి బాగ్‌లో 388, ఆర్కేపురంలో 373గా ఏక్యూఐ నమోదైంది. ఆయా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ అధ్వాన స్థితిలో ఉన్నట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పేర్కొంది. కాలుష్యం నేపథ్యంలో విజిబులిటీ సైతం తగ్గింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేసింది. వివేక్ విహార్, ఆనంద్ విహార్, ఇండియా గేట్ తదితర ప్రాంతాల్లో 500 మీటర్ల వరకు దృశ్యమానత తగ్గింది. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజల కళ్లల్లో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

ఇంట్లోనే ఉండి యోగా, ప్రాణాయామం చేయాలని సూచిస్తున్నారు. ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతోందని ఢిల్లీ ప్రభుత్వ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. కాలుష్య స్థాయిని తగ్గించేందుకు సంబంధిత ఏజెన్సీలన్నీ చురుగ్గా పని చేస్తున్నాయని.. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో శీతాకాల కార్యాచరణ ప్రణాళిక కింద వివిధ శాఖలు, ఏజెన్సీలు చేస్తున్న పనులను మంగళవారం సమీక్షించనున్నట్లు గోపాల్ రాయ్ పేర్కొన్నారు. ఇందులో అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారుతోన్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమసల్యకు గురికావాల్సి వస్తోంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
7 । నవంబర్ । 2024



## కెనడాలో హిందువుల భారీ ర్యాలీ



టొరాంటో–నవభూమి: హిందువులపై ఖలిస్థాన్ వేర్పాటువాదుల దాడి కెనడాను కుదిపేస్తున్నది. బ్రాంప్టన్ ఘటనపై కెనడాలోని హిందువులు పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఖలిస్థాన్ వేర్పాటువాదుల దుశ్చర్యలను ఖండిస్తూ సోమవారం బ్రాంప్టన్ నగరంలో హిందువులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. హిందువులకు వ్యతిరేకంగా కెనడాలో హింస పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది హిందువులు భారత త్రివర్ణ పతాకాలను, కాషాయ జెండాలను ప్రదర్శిస్తూ ఈ నిరసనలో పాల్గొన్నారు. ఒంటారియా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హిందువులు బ్రాంప్టన్‌లోని గోరే రోడ్ కూడలి వద్దకు తరలివచ్చారు. కాగా, నిరసనను కెనడా పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకు అనుమతులు లేవని పేర్కొన్నారు. ఖలిస్థాన్ వేర్పాటువాదానికి, ట్రూడో సర్కార్‌కు వ్యతిరేకంగా హిందువులు నినాదాలు చేశారు. ఘటన పట్ల ట్రూడో సర్కార్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



## అమెరికా ఎన్నికల ఫలితాల వేళ డొనాల్డ్ ట్రంప్ గెలుపు ప్రసంగం..

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు తనకు అనుకూలంగా రావడంతో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తన మద్దతుదారులను ఉద్దేశించి.. ఆయన గెలుపు ప్రసంగం చేశారు. అమెరికా చరిత్రలో ఎప్పుడూ చూడని విజయాన్ని ఇప్పుడు మనం దక్కించుకున్నామని రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులతో ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికా ప్రజలకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. అమెరికా ఫస్ట్ అనేది తన నినాదం అని డొనాల్డ్ ట్రంప్ మరోసారి తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ 315 స్థానాలు గెలుచుకుంటుందని ట్రంప్ తెలిపారు. ఈ సభకు డొనాల్డ్ ట్రంప్, సతీమణి మెలానియా ట్రంప్, చిన్న కుమారుడు బారన్ ట్రంప్‌తో కలిసి వచ్చారు. అమెరికా చరిత్రలోనే ఇది మరుపురాని విజయం అని తెలిపిన ట్రంప్.. ఈ మార్పు అమెరికాను ముందుకు తీసుకెళ్లేందుకు ఉపయోగపడుతుందని తేల్చి చెప్పారు. అమెరికన్లకు సువర్ణ యుగం రాబోతుందని పేర్కొన్న ట్రంప్.. ఈ ఎన్నికల యుద్ధంలో రిపబ్లికన్లు గొప్ప పోరాటం చేశారని కొనియాడారు. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్లు చేపట్టిన ప్రచారం అతిపెద్ద రాజకీయ ఉద్యమమని తెలిపారు. ఈ గొప్ప విజయం దక్కిన సందర్భంగా దేశ ప్రజలకు తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి అమెరికా ప్రజలు, కుటుంబాల కోసం పోరాటం చేస్తానని తెలిపారు. రిపబ్లికన్లను విమర్శించే వారి విమర్శలు తప్పని నిరూపించారని పేర్కొన్నారు. అడ్డంకులను అధిగమించి అసాధ్యాన్ని సుసాధ్యం చేసినట్లు వివరించారు. ఈ విజయం కోసం కష్టపడిన వారికి తగిన ప్రతిఫలం ఉంటుందని చెప్పారు. ఇక ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఆపి, అమెరికాను గ్రేటెస్ట్‌గా మార్చడానికి కావాల్సిన ప్రయత్నాలు చేస్తానని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లో సరిహద్దుల సమస్యను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చట్టబద్ధంగా ఇతర దేశాల వారు అమెరికాలోకి రావాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన భార్య మెలానియాకు కృతజ్ఞతలు చెప్పిన ట్రంప్.. ఆమె రాసిన పుస్తకం ప్రజాదరణ పొందిందని తెలిపారు.

ఈ సందర్భంగా అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్‌ను ఎంపిక చేయడం గొప్ప విషయం అని ప్రశంసలు గుప్పించారు. కాబోయే ఉపాధ్యక్షుడు వాన్స్, ఆయన భార్య ఉషా వాన్స్‌కు అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ప్రజలు ప్రకృతి వైపరీత్యంలో చిక్కుకున్నపుడు.. వారిని రక్షించే చర్యల్లో భాగంగా ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్ ఎంతో సహాయం చేసిందని తెలిపారు. ఇక డొనాల్డ్ ట్రంప్ విజయంపై స్పందించిన ఉపాధ్యక్ష అభ్యర్థి జేడీ వాన్స్.. ఇది అమెరికా చరిత్రలో అతిపెద్ద రాజకీయ పునరాగమనం అని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రపంచ దేశాధినేతల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ఎక్స్ (ట్విట్టర్)లో శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో అపూర్వమైన విజయాన్ని అందుకున్న నా ప్రియమైన మిత్రుడికి హృదయపూర్వక అభినందనలు అంటూ మోదీ ట్వీట్ చేశారు. మీ మునుపటి పదవీకాల విజయాలకు తగ్గట్టుగా.. భారత్–యూఎస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కలిసిపనిచేద్దామని మోదీ స్వాగతించారు.

'చరిత్రాత్మక ఎన్నికల విజయం సాధించిన డొనాల్డ్ ట్రంఫ్‌నకుహృదయపూర్వక శుభాకాంక్షలు.. మీ మునుపటి పదవీకాలంలో విజయాలకు కొనసాగింపుగా భారత్– అమెరికా సమగ్ర, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి.. సహకారాన్ని పునరుద్ధరించడానికి నేను ఎదురుచూస్తున్నాను. మన ప్రజల అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాం.. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించేందుకు కలిసి కృషి చేద్దాం' అని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉన్న విషయం తెలిసిందే. గతంలో మోదీ, ట్రంప్‌లు కలిసి అమెరికాలో హౌడీ మోదీ, అహ్మదాబాద్‌లో నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోదీ తనకు మంచి మిత్రుడని ట్రంప్ ఎప్పుడూ చెబుతూ ఉంటారు. ఎన్నికల సమయంలో భారతీయ అమెరికన్ ఓటర్లతో నిర్వహించిన సమావేశాల్లోనూ మోదీ గురించి ప్రస్తావించి, వారి మెప్పు పొందే ప్రయత్నం చేశారు.

క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్(మళ్లీ పుంజుకున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ గెలుపు ఖాయం కావడంతో.. బిట్‌కాయిన్ ట్రేడింగ్‌లో దూసుకెళ్లింది. బైనాన్స్ క్రిప్టో ట్రేడింగ్ ప్లాట్‌ఫాంపై బీటీసీ ఎక్స్‌చేంజ్ రేటు కొత్త రికార్డు క్రియేట్‌చేసింది. ట్రేడింగ్‌లో సుమారు 9.26 శాతం పెరుగుదల చూపించింది. ఓ దశలో ఆ కరెన్సీ విలువ 75వేల డాలర్లుగా ట్రేడ్ అయ్యింది. ఆ తర్వాత 74.2 వేల డాలర్లకు స్థిరపడింది. బిట్‌కాయిన్‌తో పాటు ఇతర క్రిప్టోకరెన్సీలు ఉత్తమ ప్రదర్శన ఇచ్చాయి. ఎథీరియమ్ కాయిన్ కూడా మార్కెటింగ్‌లో మెరుగ్గా ట్రేడింగ్ అయ్యింది. వైట్‌హౌజ్ రేసులో ట్రంప్ దూసుకెళ్తున్నట్లు సంకేతాలు అందడంతో.. క్రిప్టో ట్రేడింగ్‌లో బిట్‌కాయిన్ సూపర్ షో ఇచ్చింది. ఎన్నికల ప్రచారం సమయంలో.. క్రిప్టో ఇన్‌వెస్టర్లకు ట్రంప్ హామీ ఇచ్చారు. న్యూయార్క్ సిటీ బార్‌లో తమ పార్టీ మద్దతుదారులకు చీజ్‌బర్గర్లు, బీర్లు కొనేందుకు బిట్‌కాయిన్‌ను ట్రంప్ వాడారు. మేక్ అమెరికా గ్రేట్ వన్స్ అగైన్ నినాదంతో ట్రంప్ ఈ ఎన్నికల్లో ప్రచారం చేశారు. అయితే 2020లో బైడెన్ చేతిలో ఓడిన ట్రంప్.. రెండో సారి దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు లైన్ క్లియర్ అయ్యింది. వరుసగా కాకుండా.. రెండోసారి దేశాధ్యక్ష పీఠాన్ని అధిరోహించబోతున్న రెండవ దేశాధ్యక్షుడిగా ట్రంప్ రికార్డు క్రియేట్ చేయనున్నారు. 1892లో గ్రోవర్ క్లీవ్‌ల్యాండ్ రెండోసారి(నాన్‌కాంజిక్యూటివ్) బాధ్యతలు చేపట్టారు. దేశాధ్యక్ష అభ్యర్థిగా మళ్లీ పోటీ చేయనున్నట్లు 2022, నవంబర్ 15వ తేదీన ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత బైడెన్, ట్రంప్ మధ్య డిబేట్ జరిగింది. కానీ ఆ చర్చలో బైడెన్ విఫలం అయ్యారు. దీంతో ఆయనపై వత్తిడి పెరిగింది. అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని బైడెన్‌పై డెమోక్రాట్లు వత్తిడి తెచ్చారు. ఆ తర్వాత కమలా హ్యారిస్ రేసులో నిలిచారు. అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ ప్రకటించిన తర్వాత.. ట్రంప్‌పై రెండుసార్లు హత్యాయత్నం ప్రయత్నం జరిగింది. పెన్సిల్వేనియాలో జరిగిన ఓ ర్యాలీలో ప్రసంగిస్తున్న సమయంలో.. ఓ ఆగంతకుడు కాల్పులు జరిపాడు. ఓ బుల్లెట్ ట్రంప్ చెవిని చీల్చింది. ఇక ఫ్లోరిడా గోల్ఫ్‌కోర్సులో ఓ వ్యక్తి ఏకే 47తో పట్టుబడ్డారు. ట్రంప్‌ను హత్య చేసేందుకు ఆ వ్యక్తి వచ్చినట్లు గుర్తించారు.

# భౌతికశాస్త్రంలో తొలి భారతీయ నోబెల్ గ్రహీత



**నవంబర్ 7 సి వి రామన్ జయంతి సందర్భంగా**

ఆయన "అరకొర సదుపాయాలున్న కాలంలోనే భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న తొలి భారతీయుడు. ప్రతిష్టాత్మక భారతరత్న అందుకున్న విజ్ఞాన కెరటం. భారతీయుల ఆధునిక విజ్ఞాన ప్రతిభాపాటవాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహావ్యక్తి." భారతదేశంలో సైన్స్ అభివృద్ధికై పాటుపడ్డ మహనీయుడు. " విజ్ఞాన శాస్త్ర సారాంశం ప్రయోగశాలల పరికరాలతో వికసించదు, నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తులే విజ్ఞానశాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి " అని చెప్పిన ఆయన మరెవరో కాదు. 7 నవంబర్ 1888 నాడు తమిళనాడులోని తిరుచురాపల్లిలో చంద్రశేఖర్ అయ్యర్, పార్వతి అమ్మాళ్ దంపతులకు జన్మించిన భరతమాత ముద్దు బిడ్డ "చంద్రశేఖర్ వెంకట రామన్". అందరికీ తెలిసే పేరు సివి రామన్. తండ్రి విశాఖపట్నంలో ఎవియన్ కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యునిగా పనిచేయడం వల్ల రామన్ బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం విశాఖలోనే జరిగింది. చిన్నప్పటి నుండే విజ్ఞానశాస్త్రల ఆసక్తిని కనబరిచేవారు. తండ్రి భౌతిక అధ్యాపకులవడం సైన్స్ పట్ల మరింత కుతూహలం పెంచుకునేలా చేసింది. చిన్నతనం నుంచి తెలివైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్న రామన్ తన పన్నెండవ యేట విశాఖపట్నంలో సెయింట్ అలోసియస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్ హయ్యర్ సెకండరీ విద్యనుని పూర్తి చేసారు. ఫిజిక్స్ సబ్జెక్టులో బంగారుపతకాన్ని సాధించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో 1902 లో ప్రవేశించి డిగ్రీ ప్రథమశ్రేణిలో బంగారు పతకంతో ఉత్తీర్ణుడైనారు. 1907 లో అదే కాలేజీ నుండి ఎం.ఎ ( ఫిజిక్స్) డిస్టింక్షన్లో ఉత్తీర్ణుడయ్యారు. తన 18వ ఏటనే కాంతికి సంబంధించిన ధర్మాలపై ఈయన రాసిన పరిశోధనా వ్యాసం లండన్ నుంచి వెలువడే ఫిలసాఫికల్ మేగజైన్‌లో ప్రచురితమైంది. ఆయనలోని పరిశోధనాభిరుచిని పరిశీలించిన అధ్యాపకులు ప్రోత్సహించి ఇంగ్లాండు వెళ్ళి పరిశోధన చేయమన్నారు. కానీ ప్రభుత్వం నిర్వహించిన వైద్య పరీక్షలో ఆయన ఇంగ్లాండు వాతావరణానికి సరిపడదని తేల్చడంతో



ఇంగ్లాండు ప్రయాణం విరమించుకున్నారు. నన్ను అన్‌ఫిట్ అన్న ఆ డాక్టరుకు నేనెంతో రుణపడి ఉన్నాను అని తర్వాత రామన్ పేర్కొన్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాస్కై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్గా చేరారు. కానీ విజ్ఞాన పరిశోధన తృష్ణవలన తను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసరుగా చేరారు.

**రామన్ ఎఫెక్టు సిద్ధాంతానికి బీజం:**

1921లో లండన్ నుండి తిరుగు ప్రయాణంలో ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు ఆకాశం, సముద్రం నీరు రెండింటికి నీలిరంగు ఉండటం ఆయనను ఆలోచింపచేసింది. సముద్ర జలంలోని అణువులు సూర్యకాంతిని వివిధ వర్ణాలుగా విడదీసి వెదజల్లుతాయి. వివిధ వర్ణాలు వివిధ దశలలో వెల్లివిరుస్తాయి. నీలిరంగు కిరణాలు మాత్రం ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయి ప్రతిఫలిస్తాయి. అందువల్ల సముద్రం నీలి రంగులో ఉంటుందని రామన్ వివరించారు. సముద్రపు నీటి గుండా కాంతి ప్రవహించేటప్పుడు కాంతి పరిక్షేపణం చెందడమే కారణం అని తెలిపారు. ద్రవాలు, వాయువులు, పారదర్శక ఘనపదార్థాలు కాంతి పరిక్షేపణంపై పరిశోధనలు చేశారు. కాంప్టన్ ఫలితం ఎక్స్ కిరణాల విషయంలో నిజమైనపుడు కాంతి విషయాలలో నిజం కావాలి కదా అని అలోచించి పరిశోధనలు కొనసాగించారు. కోల్‌కతాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది కల్టివేషన్ ఆఫ్ సైన్స్ ప్రయోగశాలలో 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్ట్" అనే సిద్ధాంతాన్ని కనుగొన్నారు. ఇది స్పెక్ట్రోస్కోపీలో ఒక దృగ్విషయం. ఇది అసామాన్యమైనది. ఈ ప్రయోగానికి అయిన ఖర్చు కేవలం 200 రూపాయలు మాత్రమే ! ఈ ప్రయోగానికే ఆయనకు 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ప్రపంచ శాస్త్రజ్ఞులంతా సి.వి గారిని అభినందించారు. రామన్ భారతీయ డ్రమ్స్ విశిష్టతను కూడా అధ్యయనం చేశారు. ??తబలా, మృదంగం ధ్వనుల హార్మోనిక్ స్వభావం గురించి అతని విశ్లేషణలు మొదటి శాస్త్రీయ అధ్యయనాలు. అతను పియానోఫోర్ట్ స్ట్రింగ్ కంపనాలపై విమర్శనాత్మక పరిశోధనను రాశారు. దీనిని కౌఫ్‌మన్ సిద్ధాంతంగా పిలుస్తారు.

**రామన్ ఎఫెక్ట్ అంటే ?**

పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింపచేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుంది. రామన్ ఎఫెక్ట్ అనేది కాంతి కిరణాన్ని అణువుల ద్వారా మళ్లించినప్పుడు సంభవించే కాంతి తరంగదైర్ఘ్యంలో మార్పును సూచిస్తుంది. కాంతి ఒక అణువును ఎదుర్కొన్నప్పుడు, దానిని వివిధ మార్గాల్లో చెల్లాచెదురు చేయవచ్చు అని ఈ దృగ్విషయం తెలుపుతుంది.

**అనువర్తనాలు :**

రామన్ స్పెక్ట్రోస్కోపీ అనేది రామన్ ఎఫెక్ట్ అనువర్తనం. ఇది రోగనిర్ధారణ సాధనం. ప్రోటీన్ నిర్మాణాన్ని అధ్యయనంలో, కణజాలం, కణాలలో జీవఅణువులను, శరీరంలోని ప్రాణాంతక కణజాలాన్ని కూడా గుర్తించగలదు. వైద్యశాస్త్రంలో క్యాన్సర్ వ్యాధితో పాటుగా కరోనా వైరస్, హెపటైటిస్, డెంగ్యూ జ్వరంలాంటి వ్యాధులను నిర్ధారించడానికి, బయోమెడికల్ ఇంజనీరింగ్, లైఫ్ సైన్స్‌లో దాని రోగనిర్ధారణ సామర్థ్యం కోసం విస్తృతంగా ఉపయోగించే సాధనంగా రామన్ స్పెక్ట్రోస్కోపీ మారింది. ఔషధాల తయారీ తుది ఉత్పత్తి ధృవీకరణలోను, తయారీప్రక్రియలోను, నాణ్యత నియంత్రణలోను ఉపయోగకరంగా ఉంటుంది. శరీరకణాలలో ప్రోటీన్లు, లిపిడ్లు, న్యూక్లియిక్ ఆమ్లాల కంటెంట్‌ను పర్యవేక్షించడంలోను ఉపయోగపడుతుంది. ఈ నిర్దిష్ట సాంకేతికత ద్వారా ఆహార నాణ్యత, ఆహార ఉత్పత్తుల ప్రమాణీకరణను సులభంగా నిర్వహించవచ్చు. రసాయన సమ్మేళనాలను గుర్తించడానికి, పరమాణుబంధాలు, పరస్పర చర్యలను అర్థం చేసుకోవచ్చు. ఆహారపరిశ్రమలో ఆహార ఉత్పత్తుల నాణ్యత, భద్రతను నిర్ధారించోచ్చు. పర్యావరణ కాలుష్య కారకాలను గుర్తించవచ్చు. ఇది నీరు, గాలి, మట్టిలోని కాలుష్య కారకాలను గుర్తించి లెక్కించగలదు. పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలకు సహాయపడుతుంది. నేరనిర్ధారణ విభాగంలో తుపాకీ కాల్పులు అవశేషాలు, ఫోర్జరీ పత్రాలను గుర్తించడంలోనూ, రిమోట్ సెన్సింగ్, గ్రహాల అన్వేషణలోనూ అంగారక గ్రహంలోని ఖనిజాలను పసిగట్టడానికి రామన్ స్కాటరింగ్ ఉపయోగపడుతుంది.

**సత్కారాలు:**

1933లో బెంగుళూరుకు వెళ్లి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి మొదటి భారతీయ డైరెక్టర్ అయ్యారు. అతను అదే సంవత్సరం ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌ని స్థాపించారు. రామన్ తన పూర్వ విద్యార్థి పంచాపకేశ కృష్ణమూర్తితో కలిసి 1943లో ట్రావెన్‌కోర్ కెమికల్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కో లిమిటెడ్ అనే కంపెనీని ప్రారంభించాడు. ఈ కంపెనీ భారతదేశంలోని మొట్టమొదటి సేంద్రీయ, అకర్బన రసాయన తయారీదారులలో ఒకటి. 1954 లో 'భారతరత్న' బిరుదు పొందారు. 1957 లో సోవియట్ యూనియన్ లెనిన్ బహుమతితో సత్కరించింది. రామన్ 1948లో ఐఐఎస్‌సి నుండి పదవీ విరమణ చేసి ఒక సంవత్సరం తర్వాత బెంగుళూరులో రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ స్థాపించారు. 21 నవంబర్ 1970 లో మరణించే వరకూ ఇక్కడే పనిచేసారు. విదేశాలలో ఎన్నో అవకాశాలున్నా కాదని మన దేశంలోనే అరకొర సదుపాయాలతోనే పరిశోధనలు చేసి సివిరామన్ ఎన్నో విజయాలు సాధించారు. రామన్ ఎఫెక్టు ఆవిష్కరణ జ్ఞాపకార్థం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.

**నోబెల్ బహుమతి ఇంకెంత దూరం:**

మునుముందు మనదేశంలో ఇలాంటి మేధావులను తయారుచేయాలంటే విజ్ఞాన శాస్త్రంలో పరిశోధన అభివృద్ధి సంస్థలను అధిక సంఖ్యలో స్థాపించి మరిన్ని నిధులను ప్రభుత్వాలు కేటాయించాలి. కార్పొరేట్ పాఠశాలలు అవలంబించే మూసబట్టీ పద్ధతులకు స్వస్తి చెప్పాలి. శాస్త్రీయ అనువర్తనాల ప్రాముఖ్యతను గుర్తించేవిధంగా విద్యార్థులను తయారుచేయాలి. శాస్త్రీయ అభివృద్ధికి కొత్త సాంకేతికతలను జోడించి శాస్త్ర సాంకేతికతలను ప్రోత్సహించాలి. త్వరలోనే భౌతికశాస్త్రంలో మరో నోబెల్ బహుమతి మన భారతీయులకు వరిస్తుందని ఆశిద్దాం.

జనక మోహన రావు దుంగ
యం.యస్సీ ( ఫిజిక్స్ )
8247045230

# వైద్యంపై ప్రభుత్వాలు శ్రద్ధపెట్టాలి

మనదేశంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జీడీపీలో 1.1 నుంచి 1.6 శాతం మాత్రమే ఆరోగ్యానికి ఖర్చు చేస్తున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత తక్కువ. ఇందులోనే తాగునీటికి, పారిశుధ్యానికి కేటాయింపులు జరుగుతున్నాయి. వైద్య, ఆరోగ్య రంగానికి జీడీపీలో 2.5శాతం నిధులు ప్రస్తుతం కేటాయించి, క్రమంగా దానిని 5.5 శాతానికి పెంచవలసిన అవసరం ఉంది. అంతేకాక తాగునీటికి, పారిశుధ్యానికి విడిగా నిధులు కేటాయించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆరోగ్య వసతులు క్రమేణా పెంచుతున్నప్పటికీ, ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రజల ఆరోగ్య అవసరాల కోసం దేశంలో వెచ్చిస్తున్న వ్యయంలో 63శాతం ప్రజలు తమ సొంత నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు. దాంతో ప్రతి ఏటా 5.5 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు చేరుతున్నారు. ప్రజల జేబుల నుంచి వైద్యానికి వ్యయం చేస్తున్న దానిలో ఎక్కువ శాతం మందులకే ఖర్చవుతోంది. మందులపై ప్రస్తుతం 5 నుంచి 18 శాతం ఉన్న జీఎస్టీని తొలగిస్తే ప్రజలకు కొంత భారం తగ్గుతుంది. ప్రజలందరికీ ప్రాథమిక, ద్వితీయ, తృతీయ స్థాయి వైద్యానికి తగిన కనీస వైద్య మౌలిక వసతులు, మానవ వనరులను ప్రభుత్వాలు కల్పించాలి. సరైన వైద్య సదుపాయాలతో పాటు రక్షిత త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై కూడా ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. సాంక్రమిత వ్యాధులతో పాటు, సాంక్రమితేతర జబ్బులు అంటే మధుమేహం, రక్తపోటు వంటివి కూడా ఆధునిక జీవన విధానంలో అధికమవుతున్నాయి. ధూమపానం వంటి దురలవాట్లు, సరైన వ్యాయామం లేకపోవడం, ఆహార నియంత్రణ పాటించకపోవడం తద్వారా స్థూలకాయానికి దారి తీసి మధుమేహం, రక్తపోటు, కాలేయం, మూత్రపిండాల జబ్బులు మధ్య వయస్కులలో కూడా పెరుగుతున్నాయి. ప్రజలు కూడా తమ ఆరోగ్య రక్షణ కోసం వ్యక్తిగత జీవితాన్ని క్రమశిక్షణతో గడపాలి. దురలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా ప్రజలు అనేక రకాల రుగ్మతల బారిన పడకుండా ఉండడానికి ఆస్కారం ఉంది. వైద్యంలో సరైన శిక్షణ, అర్హత లేనటువంటి నకిలీ వైద్యులు యాంటీబయాటిక్‌లను నిర్హేతుకంగా, అతిగా వినియోగించడం వలన ఆయా మందులకు వ్యాధి నిరోధక ప్రభావం తగ్గిపోతున్నది. యాంటీబయాటిక్స్ బాధ్యతాయుతంగా వినియోగించేలా చూడడం,



అందుకోసం జాతీయస్థాయిలో ఈ%–%ప్రిస్క్రిప్షన్ విధానాన్ని రూపొందించి అమలు చేయడం అవసరం. వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రులపై భౌతిక దాడులు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. ఇవి అత్యవసర చికిత్స అందించడానికి వైద్యులు వెనకడుగు వేసే పరిస్థితులకు దారి తీస్తాయి. గత సంవత్సరం కేరళలో యువ వైద్యురాలు డాక్టర్ వందనాదాస్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ఖైదీకి చికిత్స చే?స్తుండగా, ఆ ఖైదీ చేతిలో ఆమె హత్యకు గురి కావడం దేశవ్యాప్తంగా వైద్యులను ఆందోళనకు గురిచేసింది. వైద్యులు నిర్భయంగా, ప్రశాంత వాతావరణంలో ప్రజలకు అత్యవసర వైద్యం అందించడానికి ప్రస్తుతం 23 రాష్ట్రాలలో ఉన్న రాష్ట్రస్థాయి వైద్యుల రక్షణ చట్టాలను కఠినతరం చేస్తూ మార్పులు తీసుకురావాలి. డాక్టర్ వందనాదాస్ సంఘటన తర్వాత కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్ర చట్టాన్ని కఠినతరం చేస్తూ సవరించింది. కేంద్ర స్థాయిలో కూడా ప్రత్యేకంగా వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రుల రక్షణ చట్టాన్ని తీసుకురావడం అత్యవసరం. అలాగే వైద్యుల నిర్లక్ష్యం ఫిర్యాదులపై కేసులు నమోదు చేసేటప్పుడు సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా పోలీస్ శాఖకు నిర్దిష్ట నిబంధనావళి కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో రూపొందించి [redacted]న్ని పోలీస్ స్టేషన్లకు జారీ చేయాలి. లేదంటే అవగాహన లేమితో పోలీసులు వైద్యులపై కొన్నిచోట్ల హత్యారోపణ, హత్యాయత్నం సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం చూస్తున్నాం. కొన్ని సంవత్సరాల క్రితం రాజస్థాన్‌లో ప్రసవ సమయంలో ఒక మహిళ అధిక రక్తస్రావంతో మరణిస్తే వైద్యురాలిపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన సంఘటనలో, సీనియర్ వైద్యురాలు తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ఈ విధమైన వేధింపులు వైద్యులు ఎదుర్కోవాల్సి వస్తే అత్యవసర చికిత్సలు అందించడానికి వారు తటపటాయించే అవకాశం ఉంది. ఆధునిక వైద్యాన్ని అందిస్తున్న 4లక్షల మంది వైద్యులు సభ్యులుగా కలిగి, దేశంలో 1764 శాఖలు ఉన్న భారతీయ వైద్య సంఘం దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. ఐఎంఏ ప్రపంచంలోనే అతిపెద్ద వృత్తి నిపుణుల సంస్థ. దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించే సమయంలో ఐఎంఏను భాగస్వామిని చేయాలి.

గత సంవత్సరం డిసెంబర్‌లో తిరువనంతపురంలో జరిగిన 95వ ఐఎంఏ జాతీయ మహాసభల సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, విభిన్న రంగాలకు చెందిన మేధావులు వరస సమావేశాలు నిర్వహించి రానున్న 50 సంవత్సరాల కాలానికి దేశ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం హెల్త్ మేనిఫెస్టో రూపొందించారు. ఇందులో అన్ని కోణాల నుంచి వైద్య ఆరోగ్య రంగాలలో తీసుకోవాల్సిన చర్యల్ని కూలంకషంగా వివరించారు. ఈ హెల్త్ మేనిఫెస్టోను సాధారణ ఎన్నికలు జరుగుతున్న ఈ సమయంలో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అందజేయనున్నది. ఆయా రాజకీయ పక్షాలు ఐఎంఏ హెల్త్ మేనిఫెస్టోని అధ్యయనం చేసి, ఇందులోని అంశాలను తమ పార్టీ మ్యానిఫెస్టోలలో పొందుపరచడానికి గల అవకాశాలను పరిశీలించాలి. పేదవానికీ ధనికునికి ఒకే రకమైన వైద్యం అందుబాటులోకి వచ్చిన నాడు సార్వజనీన వైద్యం సాధించినట్లు అవుతుంది. ఆ దిశలో ప్రభుత్వాలు పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే ప్రజలకు ఆరోగ్య హక్కు అందించినట్లు అవుతుంది.

## మనలోని దివ్య శక్తిని గుర్తిద్దాం

భక్తి



మానవులు అందరికీ సంబంధించిన ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. ఆకాశం నుంచి ఒక పెద్ద బండరాయి కింద పడుతోంది. దానికి సరిగ్గా కింద మీరు నిలబడి ఉన్నారు. ప్రస్తుతానికి అది మీరు పైకి చూసినా కనిపించనంత ఎత్తులో ఉంది. కానీ అది కిందికి దూసుకువస్తోంది. అది దగ్గరకు వచ్చినప్పుడు అదేమిటో మీకు తెలుస్తుంది. అప్పుడు అటూ ఇటూ పరుగెత్తి, తప్పించుకోవాలని ప్రయత్నిస్తారు. కానీ అది సాధ్యం కాదు. మీరు పుట్టినప్పుడే అది కింద పడడం మొదలయింది. దాని మీద మీ పేరు రాసి ఉంది. ఎవరి రాయి వాళ్ళమీదే పడుతుంది. దాన్ని తప్పించుకున్నవారు ఎవరూ లేరు. అదే విధి. అదే మృత్యువు.

ఈ లోకంలో ఎంతోమంది దుఃఖంతో, బాధలతో సతమతం అవుతున్నారు. మాయ కోసం పాకులాడుతున్నారు. వాస్తవానికి అందరూ పరుగులు తీస్తున్నది మనసు వెనుకే... అదే మనిషిని మాయ దిశగా పరుగులు పెట్టేలా ప్రేరేపిస్తుంది. అది ఎటువైపు పరుగెత్తిస్తుందో తెలుసుకోవడం చాలా కష్టం. మీ పిల్లాడు సరిగ్గా చదువుకోకపోతే మీకు చాలా బాధ కలుగుతుంది. ఆఫీసులో మీ పని సరిగ్గా పని చెయ్యడం లేదని ఎవరైనా చెబితే బాధపడతారు. కష్టాలను తప్పించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. కానీ మన మీద పడబోయే రాయి గురించి ఆలోచించరు. ఒక విషయం మాత్రం గుర్తించుకోండి. ఇక్కడ ఉన్న ఈ సమయంలోనే మీరు సుఖాన్నైనా, దుఃఖాన్నయినా అనుభవించగలరు. మీ పరిస్థితుల్లో ఏ విధమైన మార్పూ రాకపోయినా... మీరు సంతోషంగా ఉండడం సాధ్యమే. అయితే దానికోసం కళ్ళు తెరిచి, వాస్తవాన్ని గమనించాలి.

మనకు ఏదైనా కీడు జరిగినప్పుడు మన కర్మ అనుకుంటాం. కానీ కారణం కర్మకాదు, మన మనసును మనం అనుసరించడం. ఇది వాస్తవం. మనం నిందించాల్సింది కర్మను కాదు. కానీ ఈ వాస్తవాన్ని మనం గమనించం. కష్టాలు, బాధలు అధికమయినప్పుడు మనం తల్లడిల్లిపోతాం. అప్పుడయినా... ఆ పరబ్రహ్మ మన హృదయంలో కొలువై ఉన్నాడని గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ సంగతి మరచిపోతే మన జీవితం అంధకారం అవుతుంది. త్రిమూర్తులు సైతం ధ్యానించే దివ్యశక్తి మన హృదయంలో ఉందని గుర్తించినప్పుడు... దుఃఖ బాధల నుంచి బయటపడగలం.

జీవితంలో ఏం చేసినా, ఎంత సాధించిన 'రాయి' (మృత్యువు) ఎప్పుడో ఒకప్పుడు మీద పడుతుందనే విషయాన్ని మరచిపోకండి. ఈలోగానే మీలో ఉన్న దివ్యశక్తి అనుభూతిని పొందండి. ఎందుకంటే అది శాంతికి నిలయం, మోక్షానికి మార్గం. రాయి మీ మీద పడేలోపు ఆ అనుభూతిని పొందితే... మీ జీవితం పూర్తిగా సఫలమైనట్టే.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్
గురువారం
7 । నవంబర్ । 2024



## 'సలాడ్స్ 'తాజాగా ఉండాలంటే..

సలాడ్స్ తయారీలో రకరకాల పండ్లు, కూరగాయలను ఉపయోగిస్తాం. ఇందుకోసం ఒక్కసారే ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయాల్సి వస్తుంది. అయితే, కొన్నిరకాల పండ్లు, కూరగాయలు రెండు, మూడు రోజులకే కుళ్లిపోతాయి. మరి, ఆరోగ్యానికి భరోసా ఇచ్చే సలాడ్స్ తాజాగా ఉండాలంటే.. కొన్ని చిట్కాలు పాటించాల్సిందే! %ఆకుకూరలు, కూరగాయలను తడిగా ఉన్నప్పుడు నిల్వ చేస్తే త్వరగా పాడైపోతాయి. అందుకే, వాటిని శుభ్రంగా కడిగిన తర్వాత పొడిగా ఉండేలా టవల్‌తో బాగా తుడుచుకోవాలి. డ్రై పేపర్‌లో చుట్టి,



ఎయిర్‌టైట్ కంటెయినర్లలో స్టోర్ చేసుకోవాలి.

కొంతమంది తీరిక దొరికినప్పుడే పండ్లు, కూరగాయలన్నిటినీ కట్‌చేసి, ఫ్రిడ్జ్‌లో పెట్టేస్తుంటారు. దీనివల్ల ఆక్సీకరణ చెంది ముక్కలు రంగు మారుతాయి. ఇలాకాకుండా ఉండాలంటే.. వాటిని గాలి చొరబడని కంటైనర్‌లో ఉంచి, ఫ్రిడ్జ్‌లో పెట్టాలి.

యాపిల్, అవకాడో, అరటి లాంటి పండ్ల ముక్కలను వేరువేరుగా నిల్వ చేసుకోవాలి. ఎందుకంటే ఇవి ఇథిలీన్ గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తాయి. అది అనారోగ్యాన్ని కలిగిస్తుంది.

ఎసిడిటీని కలిగించే టమాట, సిట్రస్ జాతి పండ్లను తినేముందే సలాడ్స్‌కు జోడించాలి. ద్రాక్ష, బత్తాయి, ఆరెంజ్ లాంటివి చేర్చిన తర్వాత తినడం ఆలస్యమైతే.. సలాడ్ చేదుగా మారుతుంది.

పండ్లు, కూరగాయలతో పోలిస్తే.. ఆకుకూరలు త్వరగా కుళ్లిపోతాయి. అందుకే, పైన అలంకరణ కోసం ఉపయోగించే ఆకుకూరలను విడిగా నిల్వ చేసుకోవాలి. సర్వ్ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడే డ్రెస్సింగ్ చేయడం మంచిది.

# తొలి బధిర న్యాయవాది



సారా బెంగళూరు సెయింట్ జోసెఫ్స్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుకున్నది. న్యాయవాద వృత్తిని చేపట్టాలనేది ఆమె కల.

అంతేకాకుండా తనలా వినికిడి లోపం ఉన్నవాళ్లను ఈ రంగం దిశగా ప్రోత్సహించడానికి ఈ వృత్తిలోకి ప్రవేశించడం వెనక ప్రధాన ఉద్దేశం అంటారామె. ఇప్పుడామె నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డఫ్ అండ్ ద హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో క్రియాశీలక సభ్యురాలిగా కూడా సేవలందిస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టులో సారా తన వాదనలు అద్భుతంగా వినిపించింది. అలా సర్వోన్నత న్యాయస్థానంలో వాదించిన తొలి బధిర న్యాయవాదిగా కూడా చరిత్ర సృష్టించింది. ఈ కేసును భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వర్చువల్‌గా వినడం విశేషం. "జస్టిస్ చంద్రచూడ్ విశాల హృదయం తనలాంటి ఎంతోమందికి న్యాయవ్యవస్థలో ప్రవేశించడానికి ద్వారాలు తెరిచింది" అని సారా సంతోషం వ్యక్తం చేస్తున్నది.



కర్నాటక హైకోర్టులో ఏప్రిల్ 8న ఓ అరుదైన సంఘటన చోటుచేసుకుంది. బధిరురాలైన సారా సన్నీ అనే న్యాయవాది సంజ్ఞల (సైన్ లాంగ్వేజ్) ద్వారా తన వాదనలు వినిపించింది. సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్ సాయంతో సారా తన వాదనలు అద్భుతంగా వినిపించిందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ప్రశంసలు కురిపించారు. అంతేకాదు సంభాషణ, వినికిడి లోపం ఉన్న న్యాయవాది వాదనలు చోటుచేసుకున్న న్యాయస్థానంగా కర్నాటక హైకోర్టు కూడా చరిత్రలో నిలిచిపోయింది.

నిజానికి భారతదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తొలి బధిర న్యాయవాది సారా కావడం గమనార్హం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కూడా భారతీయ న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాలు ఉన్న మహిళల ప్రాతినిధ్యం పెరగాలని పదేపదే పేర్కొన్నారు. ఈ క్రమంలో శారీరక అవకరాలు ఉన్న భారతీయులు తమ ఆటంకాలను దాటుకొని ఏ రంగంలోనైనా రాణించవచ్చునడానికి సారా ఉదాహరణగా నిలిచిపోయింది. కేరళలోని కొట్టాయంకు చెందిన

## ఉదర సమస్య పోవాలంటే ఈ ధాన్యం అద్భుత ఔషదమట... !

తృణధాన్యాలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి, ముఖ్యంగా ఒకప్పుడు అందరికీ పరిచయమైన తృణధాన్యాలను ఇప్పటి రోజుల్లో మరీ ఎక్కువగా తీసుకుంటున్నారు. బరువును తగ్గించుకునే విషయంగా చాలామంది తృణధాన్యాలను తీసుకంటున్నారు. ఈ పురాతన ధాన్యం మాటకొస్తే ఇందులో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పోషకాలు సవృద్ధిగా ఉన్న ఫారో తృణధాన్యం గురించి తెలుసుకుందాం.

**ఫారో అంటే ఏమిటి?**

1. ఇది చాలా పోషకమైనది.
2. అన్ని తృణధాన్యాల కంటే ఎక్కువ ఫైబర్ కలిగి ఉంటుంది.
3. ఇందులో అనేక రకాల ప్రయోజనకరమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి.
4. అనేక ఇతర మొక్కల ఆహారాలతో పోలిస్తే ఇది ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ధాన్యం.
5. బరువు తగ్గడానికి ఇది ఆరోగ్యకరమైన ఆహారం

దీన్ని ఎవరు తినకూడదు?

ఫారో ఒక పురాతన ధాన్యం, ఇది వేల సంవత్సరాలుగా ప్రసిద్ధి చెందింది. ఇటీవల, దీనికి ప్రజాదరణ పెరిగింది. ఇది రుచికరమైనది మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. ఇందులో ఫైబర్, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.  కూడా శుద్ధి చేసిన ధాన్యాలకు గొప్ప ప్రత్యామ్నాయం. దీనిని ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. బియ్యం, క్వినోవా, బుక్వీట్, బార్లీ వంటి ఇతర ప్రసిద్ధ తృణధాన్యాలకు ఇది గొప్ప ప్రత్యామ్నాయం. సలాడ్‌లు, సూప్‌ల వంటి వంటలలో తీసుకోవచ్చు. అయితే,ఫారో ధాన్యంలో సహజంగా గ్లూటెన్ కలిగి ఉంటుంది. అందువల్ల ఉదరకుహర వ్యాధి  ఉన్నవారికి ఇది సరైనది కాదు. పురాతన ధాన్యాలపై జరిగిన పరిశోధనలో ఈ ఆరోగ్య సమస్య ఉన్న వారికి విషపూరితమైనవిగా తేలింది.

నాలుగు కప్పుల ధాన్యంలో
కేలరీలు: 170
కార్బోహైడ్రేట్లు: 34 గ్రాములు
కొవ్వు: 1 గ్రాములు
ఫైబర్: 5 గ్రాములుప్రోటీన్: 6 గ్రాములు
విటమిన్ (నియాసిన్): లో 20%
మెగ్నీషియం: RDIలో 15%
జింక్: RDIలో 15
ఇనుము: RDI లో 4%

# పూల ఐస్ ఫ్రూట్











మీకు పాల ఐస్ తెలుసు పూల ఐస్ తెలుసా? ఐస్‌ఫ్రూట్ తినే ఉంటారు ఫ్రూట్ ఐస్ గురించి విన్నారా? అయితే మండే ఎండల్లో ఈ చల్లచల్లటి సంగతులు తెలుసుకోవలసిందే. ఇటీవల సోషల్ మీడియాలో ట్రెండ్ అయిన మామిడి పండును పోలిన ఐస్‌క్రీమ్‌లాగే రకరకాల ఫలాలను పోలిన హిమక్రీములు, పూలని పోలిన మంచు మిఠాయిల్ని కూడా తయారు చేస్తున్నారు. చూస్తే హాయిగా, తింటే చల్లగా ఉండే వీటి విశేషాలు మీ కోసం

కొందరికి ఐస్‌క్రీమ్ ఎప్పుడూ ఫేవరెట్టే. కానీ అది అందరికీ నచ్చేది మాత్రం ఎండాకాలంలోనే. ఎండల్లో హాయ్ హాయ్‌గా అనిపించాలంటే వెన్నెలలాంటి వెనీలానో, రాత్రిలాంటి డార్క్ చాక్లెట్టో పొట్టలో పడాల్సిందే! ఒకప్పుడు మనకు తెలిసింది పుల్ల ఐసూ, పాల ఐసే అయినా ఇప్పుడు విందు భోజనంలోని వంటల రకాలన్నీ వీటిలోనూ వచ్చేస్తున్నాయి.

అచ్చంగా పండ్ల రుచిని తలపించేలా రియల్ ఫ్రూట్ ఐస్‌క్రీమ్‌లూ చవులూరిస్తున్నాయి. సీజన్‌ని బట్టి పండ్లు మారినట్టే, ఎప్పటికప్పుడు ఐస్‌క్రీమ్ వెరైటీలూ మారుతున్నాయి. కొత్త రుచులు మాత్రమే కాదు, కొత్త ఆకృతుల్లోనూ ఇప్పుడివి ఆకట్టుకుంటున్నాయి. చాలా మంది ఇష్టంగా తినే మక్కజొన్న కంకిలా కనిపించే వాటితో పాటు రకరకాల పువ్వులు, పండ్ల రూపాల్లో రూపుదిద్దుకుంటున్నాయి.

తియ్యటివి, పుల్లటివి, కమ్మటివి ఇలా పండ్లు ఎన్నో రుచుల్లో కాస్తుంటాయి. ఒక్కొక్కరూ ఒక్కో రకం పండును ఆస్వాదిస్తారు. అచ్చం అలాగే, ఎవరి అభిరుచికి తగ్గట్టు వారు ఎంచుకునేలా వివిధ ఫలాలను పోలి, అదే రుచి కలిగిన ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నాయి కంపెనీలు. ఈ పండ్ల ఆకృతిలో ఉండే ఐస్‌క్రీమ్‌లకు వైట్ చాక్లెట్ పైన పొరలా ఉంటుంది. దాని మీద ఆయా ఫలాలకు సంబంధించిన రంగులు వేస్తారు. అరటి, మామిడి, యాపిల్, బెర్రీలు.. ఇలా విభిన్న రకాల పండ్లను పోలి ఉండే వాటితో పాటు, తరిగిన పండ్ల ముక్కల ఆకృతుల్లోనూ ఈ ఫ్రూట్ ఐస్‌లను తీసుకొస్తున్నారు.

ఇవే ఈ ఏడాది సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతున్నాయి. అంతేకాదు, అసలు పండు కన్నా, ఈ ఐస్‌క్రీమ్ మరింత రుచిగా ఉందంటూ వీటిని తిన్నవాళ్లు కామెంట్లు కూడా చేస్తున్నారు. కలువ, సకుర, గులాబీ తదితర పూలను పోలిన ఐస్‌క్రీమ్‌లూ కొత్త కొత్తగా పలకరిస్తున్నాయి. ఐస్‌క్రీమ్ ప్రియుల హృదయాన్ని దోచేస్తున్నాయి. మనసుకు నచ్చిన పువ్వును, జిహ్వ మెచ్చిన పండును మంచు మిఠాయిలా రుచి చూసే అవకాశం వస్తే ఎవరు మాత్రం వదిలి పెడతారు చెప్పండి!







## బ్యాంకింగ్, లోహ షేర్లలో కొనుగోళ్లు

**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు స్వల్ప లాభ, నష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆ తర్వాత కొనుగోళ్లు పుంజుకోవడంతో భారీ లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ 694.39 పాయింట్ల వృద్ధితో 79,476.63 వద్దకు చేరుకోగా.. నిఫ్టీ 217.95 పాయింట్లు బలపడి 24,213.30 వద్ద ముగిసింది. ఆసియా, యూరప్ మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు బ్యాంకింగ్, స్టీల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్ ఇందుకు ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 రాణించాయి. జేఎసడబ్ల్యూ స్టీల్ షేరు 4.72 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్ 3.64 శాతం వృద్ధి చెందగా.. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫసీ బ్యాంక్, ఇండ్‌సఇండ్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు 2 శాతానికి పైగా పెరిగాయి. బీఎసఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.48 శాతం వరకు లాభపడగా.. రంగాలవారీ సూచీల్లో ఐటీ, టెక్, సర్వీసెస్ మినహా అన్నీ ఎగబాకాయి. మెటల్ 2.38 శాతం, బ్యాంకెక్స్ 2.09 శాతం పుంజుకోగా..

కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ 1.84 శాతం వరకు పెరిగాయి.

స్విగ్గీ ఐపీఓ నేటి నుంచే..

ఇష్యూ ధరల శ్రేణి రూ.371–390

రూ.11,327 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీతో పాటు క్విక్ కామర్స్ సేవలందించే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) బుధవారం ప్రారంభమై శుక్రవారం ముగియనుంది.



## అక్టోబర్ 2024లో భారతదేశపు అత్యధికంగా- విక్రయించబడే ఎలక్ట్రిక్ కారుగా మారిన ఎంజి విండ్సర్



**న్యూఢిల్లీ–నవభూమి:** జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా తమ ఇటీవల విడుదల చేసిన భారతదేశపు మొదటి ఇంటిలిజెంట్ సియువి ఎంజి విండ్సర్ కోసం అక్టోబర్ 2024లో గణనీయమైన సేల్స్ ను నమోదు చేసింది. కంపెనీ 3116 సియువిల యూనిట్లను విక్రయించింది, ఇది అక్టోబర్ లో మొత్తం ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్ సేల్స్ లో సుమారు 30%గా ఉంది.కంపెనీ 31సాధించింది, అక్టోబర్ 2024లో 7045 యూనిట్లను విక్రయించింది, కంపెనీ ఆరంభమైన నాటి నుండి అత్యధిక సేల్స్ గణాంకాలు ఇవి. పరిశుభ్రమైన భవిష్యత్తు కోసం సుస్థిరమైన సంచార పరిష్కారాల పైన కారు తయారీదారు చురుకైన కేంద్రీకరణ సంస్థ పోర్ట్ ఫోలియో అక్టోబర్ లో , గణనీయంగా సేల్స్ వృద్ధికి చేసిన తోడ్పాటుతో ప్రోత్సాహకర ఫలితాలను ఇస్తున్నాయి. జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా వారి మొత్తం సేల్స్ లో 70% తోడ్పాటు అందించాయి, కస్టమర్లలో కంపెనీ ఎలక్ట్రిక్ వెహికిల్ పోర్ట్ ఫోలియోకు ఉన్న ఆదరణలో వేగవంతమైన పెంపుదలను చూపించాయి.

## 31% వృద్ధితో అక్టోబర్ 2024లో 7045 యూనిట్ల విక్రయాలతో రికార్డ్ నమోదు చేసిన జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా



**న్యూఢిల్లీ–నవభూమి:** అక్టోబర్ 2024లో 7,045లిలి యూనిట్లు విక్రయించబడ్డాయని జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఈరోజు ప్రకటించింది. ఇది గత ఏడాది (అక్టోబర్ 2023)లో ఇదే నెలతో పోలిస్తే 31% వృద్ధి కలిగింది.


కంపెనీ యొక్క న్యూ ఎనర్జీ వెహికిల్స్ (ఎన్ఈవీలు) దాని మొత్తం సేల్స్ లో గణనీయమైన భాగంగా ఉన్నాయి. మొత్తం పరిమాణాల్లో 70%కి పైగా తోడ్పాడ్డాయి – దేశంలోనే ఏదైనా ప్యాసింజ్ కారు తయారీదారుచే ఒక నెలలో విక్రయించబడిన యూనిట్లలో అత్యధిక వాటా– తద్వారా ఎన్ఈవీలను ఉపయోగించడాన్ని ప్రోత్సహించడంలో తమ నిబద్ధతను ప్రదర్శిస్తోంది.

పరిశుభ్రమైన సంచారం దిశగా భారతదేశం యొక్క ప్రయాణంలో మరొక గణనీయమైన మైలురాయిగా ముద్ర వేసి, జేఎస్ డబ్ల్యూ ఎంజి మోటార్ ఇండియా ఎంజి విండ్సర్– దేశంలో మొదటి ఇంటిలిజెంట్ కార్స్ఓవర్ యుటిలిటి వెహికిల్ (సియువి) విడుదలమైన మొదటి నెలలోనే 3,116 యూనిట్లను విక్రయించడం ద్వారా ఈవీ మార్కెట్ ను విద్యుద్దీకరించింది. ఈ దృఢమైన సేల్స్ సంఖ్య అక్టోబర్ 2024లో అమ్ముడైన అన్ని ఇతర ప్యాసింజర్ ఎలక్ట్రిక్ కార్లలో అత్యధికంగా నిలిచాయి.

గత నెలలో తమ ప్రకటనకు అనుగుణంగా వాహన్ పోర్టల్ లో తమ సేల్స్ సంఖ్యను భాగస్వామం చేయడానికి కంపెనీ కట్టుబడింది. వాహన్ లో నివేదించబడిన విధంగా, కారు తయారీదారు %YoY% వృద్ధి ఈ నెలలో (తెలంగాణా మినహాయించబడింది) 34%గా ఉంది.పండగ సీజన్ లో సేల్స్ లో పెంపుదల కంపెనీ యొక్క ఎలక్ట్రిక్ వాహనాల పోర్ట్ ఫోలియో యొక్క వేగంగా పెరుగుతున్న జనాదరణను చూపిస్తోంది.–తెలంగాణ మినహాయించబడింది

## ఈక్విటీ మార్కెట్లకు ఊపునిచ్చిన ట్రంప్ గెలుపు.. 80 వేల మార్క్ దాటిన సెన్సెక్స్..!

**న్యూఢిల్లీ–నవభూమి:** దేశీయ ఈక్విటీ మార్కెట్లకు ట్రంప్ జోష్ కలిసొచ్చింది. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవ్వడం ఖాయంగా కనిపించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఫలితంగా బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ఒక్కో శాతానికి పైగా వృద్ధి చెందాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 901.50 పాయింట్లు (1.13 శాతం) లాభంతో 80,378.13 పాయింట్లకు చేరుకున్నది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 270.74 పాయింట్లు (1.12 శాతం) వృద్ధి చెంది 24,484.05 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఎన్ఎస్ఈ–50లో 41 స్టాక్స్ లాభాలు గడించాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌సీఎల్ టెక్, విప్రో 5.33 శాతం వరకూ పుంజుకున్నాయి.మరోవైపు ఎస్బీఐ లైఫ్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ట్రెంట్‌తోపాటు తొమ్మిది స్టాక్స్ నష్టపోయాయి. బ్రాడ్ ఇండెక్సులు నిఫ్టీ మిడ్ క్యాప్–100, నిఫ్టీ స్మాల్ క్యాప్–100 రెండు శాతానికి పైగా వృద్ధి చెందాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 3.99 శాతం వృద్ధి చెందితే, కేంద్ర ముడి చమురు సంస్థలు, కన్జూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ ఇండెక్స్‌లు రెండు శాతానికి పైగా లాభ పడ్డాయి.



## స్వల్పంగా తగ్గిన ధరలు.. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**న్యూఢిల్లీ–నవభూమి:** బంగారం వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి గుడ్ న్యూస్. దీపావళి పండుగకు ముందు బంగారం, వెండి రేట్లు భారీగా పెరిగి ఆల్‌టైమ్ గరిష్టానికి చేరుకున్నాయి. దీపావళి తర్వాత క్రమంగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు (నవంబర్ 6న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 80, 230కి చేరింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 80, 380కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 73,690కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 80, 230కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 73, 540కి చేరింది. వెండి ధరలు కేజీకి వంద రూపాయలు తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 80, 230, రూ. 73, 540
విజయవాడలో రూ. 80, 230, రూ. 73, 540
ఢిల్లీలో రూ. 80, 380, రూ. 73, 690
ముంబైలో రూ. 80, 230, రూ. 73, 540
వడోదరలో రూ. 80, 280, రూ. 73, 590
కోల్‌కతాలో రూ. 80, 230, రూ. 73, 540
చెన్నైలో రూ. 80, 230, రూ. 73, 540
బెంగళూరులో రూ. 80, 230, రూ. 73, 540
కేరళలో రూ. 80, 230, రూ. 73, 540
పుణెలో రూ. 80, 230, రూ. 73, 540

ప్రధాన నగరాల్లో వెండి ధరలు (కేజీకి)

హైదరాబాద్‌లో రూ. 1,05,900
విజయవాడలో రూ. 1, 04, 900
ఢిల్లీలో రూ. 95, 900
చెన్నైలో రూ. 1, 04, 900
కోల్‌కతాలో రూ. 95, 900
కేరళలో రూ. 1, 04, 900
ముంబైలో రూ. 95, 900
బెంగళూరులో రూ. 95, 900
భువనేశ్వర్‌లో రూ. 1, 04, 900
వడోదరలో రూ. 95, 900
అహ్మదాబాద్‌లో రూ. 95, 900

## కేంద్రం కొత్త స్కీమ్.. నెలకు రూ. 5 వేల చొప్పున ఒక్కొక్కరికి ఏటా రూ. 60 వేలు.. ఎలా అప్లై చేసుకోవాలి?



**న్యూఢిల్లీ–నవభూమి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్‌లో ఒక కొత్త పథకం ప్రకటించిన సంగతి తెలిసిందే. అదే ప్రైమ్ మినిస్టర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ రాబోయే ఐదేళ్లలో సుమారు కోటి మందికిపైగా యువతీయువకులకు ఇంటర్న్‌షిప్ ఇవ్వనుంది. వారిలో నైపుణ్యాల్ని అభివృద్ధి చేసేందుకు ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టింది మోదీ సర్కార్. ఇందులో భాగంగా నెలకు రూ. 5 వేల చొప్పున స్టైఫెండ్ కూడా అందిస్తుంది.


**పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్**

PMIS Internship: యువతలో నైపుణ్యాల్ని పెంపొందించి.. ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకోసమే.. 2024–25 పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఒక కొత్త పథకం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్/స్కీమ్. దీని కోసం ఇదివరకే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇక ఇందులో భాగంగానే ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన వారికి నెలకు ఒక్కొక్కరికి రూ. 5000 చొప్పున ఏడాదికి రూ. 60 వేలు స్టైఫెండ్ చెల్లిస్తుంది. రానున్న ఐదు సంవత్స రాల్లో.. టాప్– 500 కంపెనీల్లో కోటి మందికి నైపుణ్యాలు కల్పించేందుకు ఈ స్కీమ్ ఉద్దేశించింది. రూ. 800 కోట్ల ఖర్చుతో ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి.. డిసెంబర్ నుంచి ఇంటర్న్‌షిప్ అందివ్వనున్నారు.

ఈ పథకం కోసం అప్లై చేసుకునేందుకు https://pminternship.mca.gov.in/login/ కు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1.25 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ అందించనున్నారు. అభ్యర్థులు ఎవరైనా ఈ లింక్‌కు వెళ్లి.. రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్కడే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. నెల స్టైఫెండ్‌లో రూ. 4500 ప్రభుత్వం చెల్లిస్తుంది. మరో రూ. 500 శిక్షణ అందించే ఇండస్ట్రీ చెల్లిస్తుంది.

నెలవారీగా మొత్తం రూ. 5 వేల చొప్పున సంవత్సరం పాటు అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందిస్తారు. కంపెనీలో చేరే ముందు ఇచ్చే రూ. 6 వేలు (వన్‌టైమ్ గ్రాంట్) కూడా ఉంటుంది. మొత్తం ఏడాదిలో ఇలా రూ. 66 వేలు వస్తాయి. ఈ స్కీంలో స్వచ్ఛందంగా భాగస్వామ్యం అయ్యే కంపెనీలు.. ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్ అందిస్తాయి. దీంట్లో సగం కాలం క్లాసులో.. మిగతా సగం వాస్తవ ఉద్యోగ వాతావరణంలో అభ్యర్థులు గడపాల్సి ఉంటుంది.

ఇంటర్న్‌షిప్‌లో చేరే వారికి వ్యక్తిగత బీమా సౌకర్యం ఉంది. ఇప్పటికే ఉన్న పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తారు. దీనికి కావాల్సిన ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే భరిస్తుంది. 21–24 ఏళ్ల వయస్కులు అర్హులు. %బాజ% పాసైన అభ్యర్థులతో పాటు.. పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీలు ఉన్న వారెవరైనా అప్లై చేసుకోవచ్చు.




## హిందుస్థాన్ జింక్‌లో అమ్మకానికి ప్రభుత్వ వాటా

**న్యూఢిల్లీ–నవభూమి:** హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్)లో 2.5 శాతం వరకు వాటాను కేంద్ర ప్రభుత్వం అమ్మేస్తున్నది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా జరిగే ఈ విక్రయంలో ఒక్కో షేర్ ఫ్లోర్ ధరను రూ.505గా నిర్ణయించారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ట్రేడింగ్‌లో మంగళవారం ముగిసిన ధర (రూ.559.45)తో పోల్చితే ఇది 9.7 శాతం తక్కువ. సోమవారం ట్రేడింగ్‌తో చూస్తే సంస్థ షేర్ విలువ 2.99 శాతం లాభపడటం గమనార్హం. కాగా, రెండు రోజులపాటు జరిగే ఈ ఓఎఫ్ఎస్ ద్వారా రూ.5,000 కోట్ల నిధులను మోదీ సర్కారు సమీకరించే వీలున్నది. బుధవారం సంస్థాగత మదుపరులు (నాన్–రిటైల్ ఇన్వెస్టర్లు), గురువారం రిటైల్ ఇన్వెస్టర్లు బిడ్డింగ్ చేసుకోవచ్చు. ఇదిలావుంటే అమ్మేస్తున్న 2.5 శాతం వాటాలో ఈక్విటీ 1.25 శాతంగా ఉంటే, మరో 1.25 శాతం గ్రీన్‌షూ ఆప్షన్‌గా ఉందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే 'ఎక్స్' వేదికగా తెలిపారు.

## డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,342 కోట్లు



**హైదరాబాద్– నవభూమి:** డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జులై–సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 9.35 శాతం క్షీణించి రూ.1,341.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,480 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 16.51 శాతం వృద్ధితో రూ.6,880.20 కోట్ల నుంచి రూ.8,016.20 కోట్లకు చేరుకుంది. ఒక త్రైమాసిక కాలంలో రూ.8,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించటం ఇదే తొలిసారని కంపెనీ పేర్కొంది. ఈ కాలంలో గ్లోబల్ జెనరిక్స్ ఆదాయాలు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసివచ్చిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

వర్ధమాన మార్కెట్లు సహా భారత్, యూరప్, అమెరికా మార్కెట్ల నుంచి రెవెన్యూలు అంచనాలకు తగ్గట్టుగా ఉన్నాయని పేర్కొంది. త్రైమాసిక కాలంలో మొత్తం నిర్వహణ వ్యయాలు 34.3 శాతం వృద్ధి చెంది రూ.3,021.80 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. కంపెనీకి చెందిన అన్ని విభాగాలు నిలకడైన వృద్ధిని సాధించటంతో సెప్టెంబరు త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు రాబట్టుకోగలిగినట్లు డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ అన్నారు. నెస్లే భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన సంస్థ కార్యకలాపాలు ప్రారంభించటంతో పాటు నికోటినల్, ఇతర బ్రాండ్ల కొనుగోలు పూర్తి కావటంతో భవిష్యత్‌లో మంచి వృద్ధిని కనబరిచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

అమెరికా ఆదాయం రూ. 3,728 కోట్లు

సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ గ్లోబల్ జెనరిక్స్ ఆదాయాలు 17 శాతం వృద్ధి చెంది రూ.7,157.60 కోట్లుగా ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ సీఎఫఓ ఎంవీ నరసింహం చెప్పారు. కాగా అమెరికా ఆదాయాలు కూడా 17 శాతం వృద్ధితో రూ.3,728.10 కోట్లకు చేరుకున్నాయన్నారు. అమ్మకాలు గణనీయంగా పెరగటంతో పాటు అమెరికా మార్కెట్లోకి కొత్తగా నాలుగు ఔషధాలను విడుదల చేయటం కలిసివచ్చిందని ఆయన పేర్కొన్నారు.మరోవైపు యూరప్, వర్ధమాన దేశాల మార్కెట్ల నుంచి రెవెన్యూలు వరుసగా 9 శాతం, 20 శాతం మేరకు పెరిగాయని తెలిపారు. రష్యా మార్కెట్లో కొన్ని ఔషధాల బ్రాండ్ల ధరలు పెంచటంతో పాటు అమ్మకాలు పెరగటంతో కలిసివచ్చిందన్నారు. భారత మార్కెట్లో కూడా కంపెనీ ఆదాయాలు 18 శాతం వృద్ధి చెంది రూ.1,397.10 కోట్లకు చేరుకున్నాయని వివరించారు. ఈ కాలంలో దేశీయ మార్కెట్లోకి కంపెనీ కొత్తగా మూడు ఔషధ బ్రాండ్లను విడుదల చేసిందని నరసింహం తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కంపెనీ మొత్తం 16 ఔషధాలను విడుదల చేసిందని చెప్పారు.

రూ.1,200 కోట్ల పెట్టుబడులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.2,500 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించగా ఇప్పటి వరకు రూ.1,200 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎఫ్ఓ నరసింహం తెలిపారు. సెప్టెంబరు ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.1,889 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని వివరించారు. కాగా బయోసిమిలర్స్, ఇతర ఇన్నోవేటివ్ ఉత్పత్తులపై డాక్టర్ రెడ్డీస్ పెట్టుబడులను యథాతథంగా కొనసాగించనుందని కంపెనీ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు. 2027 నాటికి అమెరికా, యూరోపియన్ మార్కెట్లలోకి కనీసం మూడు బయోసిమిలర్ ఉత్పత్తులను విడుదల చేయాలని చూస్తున్నట్లు చెప్పారు.



## రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఈవీ

**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రముఖ మోటార్ సైకిళ్ల కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ సైతం ఎలక్ట్రిక్ బైక్‌ల విభాగంలోకి ప్రవేశించింది. తన తొలి ఎలక్ట్రిక్ మోడల్ 'ఫ్లయింగ్ ఫ్లీ సీ 6'ను ఇటలీలోని మిలాన్‌లో...

**రాయల్ ఎన్‌ఫీల్డ్ తొలి ఈవీ**

ప్రముఖ మోటార్ సైకిళ్ల కంపెనీ రాయల్ ఎన్‌ఫీల్డ్ సైతం ఎలక్ట్రిక్ బైక్‌ల విభాగంలోకి ప్రవేశించింది. తన తొలి ఎలక్ట్రిక్ మోడల్ 'ఫ్లయింగ్ ఫ్లీ సీ 6'ను ఇటలీలోని మిలాన్‌లో ఆవిష్కరించింది. కంపెనీ ఈ బైక్‌ను తొలుత అమెరికా, యూరప్ మార్కెట్లలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. 2026 తొలినాళ్లలో ఈ బైక్ మార్కెట్లో అందుబాటులోకి రానుంది.

## ఐటీ అధికారులు వడ్డీ మాఫీ చేయవచ్చు

**న్యూఢిల్లీ–నవభూమి:** ఆదాయపు పన్ను శాఖ అధికారులు నిర్దిష్ట షరతులకు లోబడి పన్ను చెల్లింపుదారులు చెల్లించాల్సిన వడ్డీని మాఫీ చేయడం లేదా తగ్గించడం చేయవచ్చని ఆ శాఖ తెలిపింది. ప్రత్యక్ష పన్నుల సెంట్రల్ బోర్డు (సీబీడీటీ) ఈ మేరకు సోమవారం సర్క్యులర్ జారీ చేసింది. ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 220 (2ఎ) కింద పన్ను చెల్లింపుదారుడు డిమాండ్ నోటీసు ప్రకారం పన్ను చెల్లించడంలో విఫలమైతే జాప్యం జరిగిన కాలానికి నెలకు ఒక శాతం వంతున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (పీఆర్‌సీసీఐటీ) లేదా చీఫ్ కమిషనర్ (సీసీఐటీ) లేదా ప్రిన్సిపల్ కమిషనర్ (పీఆర్‌సీఐటీ), లేదా కమిషనర్ ర్యాంక్ అధికారులకు ఈ వడ్డీని మాఫీ చేయడం లేదా రద్దు చేసే అధికారం ఐటీ చట్టం దఖలు పరిచింది.

## హిందుస్థాన్ జింక్‌లో 2.5% వాటా విక్రయం

**న్యూఢిల్లీ–నవభూమి:** వేదాంత గ్రూప్‌నకు చెందిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జెడ్ఎల్)లో 2.5 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫఎస్) ద్వారా విక్రయించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా షేరు కనీస ధరను రూ.505గా నిర్ణయించింది. మంగళవారం బీఎస్ఈలో కంపెనీ షేరు ముగింపు ధర రూ.559.45తో పోలిస్తే, ఓఎఫఎసలో షేరు 9.7 శాతం తక్కువకు లభించనుంది. కంపెనీలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ.5,000 కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. రెండు రోజులపాటు సాగనున్న ఈ ఓఎఫఎసలో బుధవారం నాన్–రిటైల్ ఇన్వెస్టర్లు, గురువారం రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ షేర్ల కొనుగోలుకు బిడ్ వేయవచ్చు.

హెచ్‌జెడ్ఎల్‌లో వేదాంత 63.24 శాతం, కేంద్రం 29.54 శాతం, ఎల్ఐసీ 2.76 శాతం వాటా కలిగి ఉన్నాయి.

## 365 రోజుల వ్యాలిడిటీతో బంపరాఫర్ ప్రకటించిన బీఎస్ఎన్ఎల్




**న్యూఢిల్లీ–నవభూమి:** ఆకర్షణీయమైన ఆఫర్ల ద్వారా కస్టమర్లను ఆకట్టుకొని పూర్వవైభవాన్ని సంతరించుకు నేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వరంగ టెలికం ఆపరేటర్ బీఎస్ఎన్ఎల్ మరో సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. దీపావళి పండుగ సీజన్‌లో అన్ని ప్రధాన టెలికం ఆపరేటర్లు ప్రకటించిన ఆఫర్లు ముగిసిపోయినప్పటికీ.. నవంబర్ 7 వరకు అందుబాటులో ఉండేలా దీపావళి ప్రత్యేక ఆఫర్‌ను బీఎస్ఎన్ఎల్ పరిచయం చేసింది.

దీపావళి ప్రత్యేక ఆఫర్ వివరాలు ఇవే..

365 రోజుల వ్యాలిడిటీతో రూ.1,999 రీఛార్జ్ ప్లాన్‌పై రూ.100 తగ్గింపును అందిస్తున్నట్టు బీఎస్ఎన్ఎల్ ప్రకటించింది. యూజర్లు రూ.1,899కే ఈ ఆఫర్‌ను పొందవచ్చని తెలిపింది. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 7 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని, ఈ ప్లాన్‌లో అపరిమిత వాయిస్ కాలింగ్‌తో పాటు 600జీబీ డేటా లభిస్తాయని తెలిపింది. ఇక రోజుకు 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు కూడా అందిస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదికగా బీఎస్ఎన్ఎల్ ఈ ఆఫర్ ప్రకటించింది. "దీపావళి తర్వాత ప్రత్యేక ఆఫర్!. రూ.1999 రీఛార్జ్ వోచర్‌పై రూ.100 తగ్గింపు పొందండి. ఇప్పుడు కేవలం రూ.1899 రీఛార్జ్ చేసుకోండి! ఒక సంవత్సరం పాటు 600 జీబీ డేటా, అపరిమిత కాల్‌లు, గేమ్స్, మ్యూజిక్, మరిన్ని బెనిఫిట్స్ ఆస్వాదించండి. ఈ పండుగ ఆఫర్ నవంబర్ 7, 2024 వరకు అందుబాటులో ఉంటుంది. ఈరోజే రీఛార్జ్ చేసుకోండి. మీ డిజిటల్ జీవితాన్ని బీఎస్ఎన్ఎల్ మరింత ప్రకాశవంతం చేయనివ్వండి!" అని ఎక్స్ ప్రకటనలో బీఎస్ఎన్ఎల్ పేర్కొంది.

కాగా జులై నెలలో ప్రైవేటు టెలికం కంపెనీలైన రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్, వీ (వొడాఫోన్ ఐడియా) టారిఫ్ రేట్లు పెంచిన నాటి నుంచి చాలా మంది యూజర్లు బీఎస్ఎన్ఎల్‌లోకి పోర్ట్ అయ్యారు. ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడం ద్వారా బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే చాలా మంది కస్టమర్లను పొందింది. ఈ క్రమంలో దీపావళి ప్రత్యేక ఆఫర్‌ను కూడా ప్రకటించింది. రిలయన్స్ జియో ప్రకటించిన దీపావళి ఆఫర్‌తో పోల్చితే బీఎస్ఎన్ఎల్ ఆఫర్‌లో ప్రయోజనాలు ఆకర్షణీయంగా ఉన్నాయి.

కస్టమర్లను ఆకర్షించడంపై దృష్టిసారించిన బీఎస్ఎన్ఎల్ ఇటీవలే వయాసాట్ సహకారంతో డీ2డీ సేవల ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించింది. దీంతో వినియోగదారులు త్వరలోనే సిమ్ కార్డ్ అవసరం లేకుండా నేరుగా ఫోన్ల మధ్య ఆడియో, వీడియో కాల్స్ చేసుకునే అవకాశం ఉంటుందని బీఎస్ఎన్ఎల్ ఇటీవలే తెలిపింది. ట్రయల్ రన్‌లో భాగంగా ఇటీవల జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించి శాటిలైట్ నెట్‌వర్క్ ద్వారా ఏకంగా 36,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంబర్‌కు విజయవంతంగా ఫోన్ చేశారు.



# మధ్యతరగతి విద్యార్థులకు శుభవార్త.. పీఎం విద్యాలక్ష్మి పథకానికి కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ– నవభూమి:** ఉన్నత విద్యా సంస్థల్లో చేరాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందుల వల్ల వారి తమ కలలను నె ర వే ర్చు కో లే క పో తు న్న (?) చేసుకోలేకపోతున్న మధ్య తరగతి విద్యార్థులకు కేంద్రం చల్లటి కబురు చెప్పింది. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేందుకు 'పీఎం విద్యాలక్ష్మి' పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారంనాడు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.పీఎం విద్యాలక్ష్మి పథకం కింద ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందిన వారు ఆయా సంస్థల్లో చదువుకునేందుకు 'విద్యా లక్ష్మి పథకం' ద్వారా రుణాలు పొందవచ్చు. ఈ రుణాలకు కొలేటరల్, గ్యారంటర్ అవసరం లేదని క్యాబినెట్ సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. దేశవ్యాప్తంగా 860 ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో రూ.7.50 లక్షల వరకూ రుణం పొందవచ్చు. రుణంలో 75 శాతం బ్యాంకులకు కేంద్రం గ్యారెంటీ ఇస్తుంది.

# అన్ని ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం కుదరదు.. సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు



**న్యూఢిల్లీ– నవభూమి:** ప్రైవేటు ఆస్తుల స్వాధీనంపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. 'ఉమ్మడి ప్రయోజనాల' పేరుతో ప్రభుత్వాలు అన్ని రకాల ప్రైవేటు ఆస్తులను స్వాధీనం చేసుకోవడం కుదరదని, అందుకు రాజ్యాంగం వీలు కల్పించడం లేదని స్పష్టం చేసింది. ప్రైవేట్ ఆస్తులను సామాజిక వనరులుగా పరిగణించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చా? లేదా? అనే అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం 7:2 మెజార్టీతో మంగళవారం 193 పేజీల తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు విస్తృత ధర్మాసనంలో సభ్యులుగా ఉన్న జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ ఎస్‌సీ శర్మ, జస్టిస్ ఏజీ మసీశ్ పూర్తిగా ఏకీభవించగా.. జస్టిస్ బీవీ నాగరత్న పాక్షికంగా ఏకీభవించారు. మరో సభ్యుడైన జస్టిస్ సుధాంశు ధులియా ఈ తీర్పును వ్యతిరేకించారు.వనరుల స్వభావం, కొరత వంటి అంశాలు ముఖ్యం

'ఆర్టికల్ 39(బీ) కింద ప్రైవేటు ఆస్తులను సమాజ వనరులుగా భావించవచ్చా అనే ప్రశ్నకు 'అవును' అనేది సిద్ధాంతపరంగా సమాధానం. ప్రైవేటు ఆస్తులను సమాజ వనరుల్లో భాగంగా చూడొచ్చు. అయితే, రంగనాథరెడ్డి కేసులో గతంలో జస్టిస్ కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పుతో ఏకీభవించలేం. కేవలం సమాజ అవసరాలకు వినియోగించడానికి అర్హత ఉందనే కారణంతో వ్యక్తుల సొంత ఆస్తిని సమాజ వనరుగా చూడలేం. వనరు స్వభావం, లక్షణాలు, కొరత, సమాజ శ్రేయస్సుపై దాని ప్రభావం, ఆ వనరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉండటం వల్ల పర్యవసానం వంటి అంశాలపై ఏదైనా ప్రైవేటు ఆస్తి సమాజ వనరా? కాదా అనేది ఆధారపడి ఉంటుంది. ప్రజా విశ్వాసాన్ని కూడా ఇక్కడ అన్వయించుకోవచ్చు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, ఆస్తులను సేకరించేందుకు ప్రభుత్వాలకు చట్టాల నుంచి ఆర్టికల్ 31సీలోని మొదటి భాగం రక్షణ కల్పిస్తుందని చెప్పిన కేశవానంద భారతి తీర్పు కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, న్యాయ సమీక్ష నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని మాత్రం కొట్టేస్తున్నట్టు పేర్కొన్నది.సీజేఐ వ్యాఖ్యలను వ్యతిరేకించిన ఇద్దరు న్యాయమూర్తులు

1977లో అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి వీఆర్ కృష్ణ అయ్యర్ ఇచ్చిన తీర్పులను చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ తప్పుబట్టారు. ఇది కఠినమైన ఆర్థిక విధానాన్ని ప్రతిపాదిస్తున్నదని పేర్కొన్నారు. 'ఆర్టికల్ 39(బీ)లో అన్ని ప్రైవేటు ఆస్తులను చేర్చడం నిర్దిష్ట ఆర్థిక ఆలోచనా విధానం తో ప్రభావితం కావడమే. భూస్వామ్య, పెట్టుబడిదారీ ఆస్తి కోటలను కూల్చేందుకు ఆర్టికల్ 39(బీ) ప్రభుత్వానికి అధికారాన్ని ఇచ్చిందని జస్టిస్ కృష్ణ అయ్యర్ భావించారు.' అని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. జస్టిస్ కృష్ణ అయ్యర్ తీర్పులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలను జస్టిస్ నాగరత్న, జస్టిస్ సుధాంశు ధులి యా వ్యతిరేకించారు. సీజేఐ పరిశీలనలు అసమంజసమని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. ఈ విమర్శ కఠినంగా ఉందని, దీని ని నివారించాల్సి ఉండేదని జస్టిస్ ధులి యా అన్నారు.

## 'గడియారం' గుర్తుపై అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టు డెడ్‌లైన్



**ముంబై:నవభూమి:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)కి సుప్రీంకోర్టు డెడ్‌లైన్ ఇచ్చింది. ఎన్నికల్లో 'గడియారం' గుర్తు వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. అయితే ఈ వివాదం ఇంకా కోర్టు పరిశీలనలో ఉన్నట్లుగా 36 గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. అజిత్ పవార్ వర్గానికి గడియారం గుర్తును ఎన్నికల కమిషన్ (ఈసీ) కేటాయించడాన్ని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ–ఎస్పీ వర్గం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను అజిత్ పవార్ వర్గం ఉల్లంఘించిందని, వివాదంపై స్పష్టత ఇవ్వకుండా గడియారం గుర్తు వినియోగాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో అజిత్ పవార్ వర్గానికి కొత్త ఎన్నికల గుర్తు కేటాయించాలని బుధవారం సుప్రీంకోర్టులో మళ్లీ వాదించింది.

కాగా, న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఇరు వర్గాల వాదనలు విన్నది. అజిత్ పవార్ వర్గం తమ ఆదేశాలను పాటించలేదని బెంచ్ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆయన వర్గానికి డెడ్‌లైన్ విధించింది. 'గడియారం' గుర్తు వివాదం ఇంకా సుప్రీంకోర్టు పరిశీలనలో ఉందంటూ 36 గంటల్లోగా డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. 'మరాఠీ, హిందీ, ఇంగ్లిష్ వార్తాపత్రికల్లో పబ్లిక్ నోటీసులు జారీ చేసి కోర్టుకు చూపించాలని పేర్కొంది. ఈ అంశంపై తదుపరి విచారణను నవంబర్ 13కు వాయిదా వేసింది. అయితే నవంబర్ 20న ఒకే దశలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

## భార్య ముందు 'అంకుల్' అని పిలిచినందుకు.. షాప్ ఓనర్‌ను కొట్టిన కస్టమర్



**న్యూఢిల్లీ–నవభూమి:** భార్య ముందు 'అంకుల్' అని పిలువడంపై ఒక వ్యక్తి ఆగ్రహించాడు. అతడితో వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత కొందరితో కలిసి ఆ షాప్ వద్దకు వచ్చాడు. తన అనుచరులతో కలిసి షాప్ యాజమానిని తీవ్రంగా కొట్టాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. జాత్‌ఖేడి ప్రాంతంలో విశాల్ శాస్త్రికి చీరల షాపు ఉంది. శనివారం రోహిత్ తన భార్యతో కలిసి ఆ షాప్ లోకి వచ్చాడు. ఈ జంట పలు చీరలను చూసింది. అయితే కొనుగోలు చేసేందుకు ఏ చీరను ఎంచుకోలేదు.కాగా, ఏ రేటులో చీర కావాలి అని విశాల్ అడిగాడు. వెయ్యి అని రోహిత్ సమాధానమిచ్చాడు. అయితే అంతకంటే ఖరీదైన చీర కూడా కొంటానని చెప్పాడు. తన కొనుగోలు సామర్థ్యాన్ని తక్కువగా భావించి మాట్లాడవద్దని హెచ్చరించాడు. దీంతో 'అంకుల్' మీకు ఆ రేంజ్‌లో చీరలు చూపిస్తాను' అని విశాల్ అన్నాడు. దీనికి ఆగ్రహించిన రోహిత్ తనను 'అంకుల్' అని పిలువ వద్దంటూ వాగ్వాదానికి దిగాడు. ఆ తర్వాత భార్యతో కలిసి ఆ షాపు నుంచి వెళ్లిపోయాడు.మరోవైపు కొంత సేపటి తర్వాత కొంత మందితో కలిసి ఆ చీరల షాపు వద్దకు రోహిత్ వచ్చాడు. వారంతా కలిసి విశాల్‌ను షాప్ నుంచి రోడ్డు వద్దకు లాక్కెళ్లి కొట్టారు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే గాయపడిన విశాల్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రోహిత్, మరి కొందరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఆ షాపు వద్ద ఉన్న సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## రక్షణ మంత్రిని తొలగించిన ఇజ్రాయిల్ ప్రధాని



**గాజా: నవభూమి:** ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవావ్ గ్యాలెంట్‌పై వేటు పడింది. ఆయన్ను తొలగిస్తూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూ ఆదేశాలు జారీ చేశారు. హమాస్, హిజ్‌బొల్లాపై జరుగుతున్న యుద్ధంలో జాప్యం చోటుచేసుకుంటున్నట్లు నెతన్యహూ పేర్కొన్నారు. విదేశాంగ మంత్రి కట్జ్‌కు .. రక్షణ శాఖను అప్పగించారు. ఇక విదేశాంగ శాఖను గిడియాన్ సార్‌కు అందజేయనున్నారు. హమాస్, హిజ్‌బొల్లాపై జరుగుతున్న పోరుపై.. రక్షణ మంత్రి గ్యాలెంట్ , తన మధ్య విభేధాలు వచ్చినట్లు నెతనహ్యా పేర్కొన్నారు. యుద్ధ సమయంలో ప్రభుత్వంపై నమ్మకం ఉండాలని, కానీ రక్షణ మంత్రి, తమ మధ్య నమ్మకం సడలినట్లు నెతన్యహూ తెలిపారు. ఆ గ్యాప్‌ను పూడ్చేందుకు చాలా ప్రయత్నం చేశానని, కానీ ఇంకా అగాధం పెరిగిందని, ఈ విషయాలు శత్రువులకు కూడా తెలిసినట్లు నెతనహ్యా చెప్పారు. మంత్రి గ్యాలెంట్‌ను తొలగించడం ఇది రెండోసారి. మార్చి 2023లో కూడా ఓ సారి ఆయనపై వేటు వేశారు. గతంలో ఆయన న్యాయ సంస్కరణలను విమర్శించారు.

# నటి కస్తూరిపై ఎంపీ రాజా ఆగ్రహం.. ద్రావిడ పాలనలో ఆర్యు ఆధిక్యాన్ని సహించం



**చెన్నై– నవభూమి:** తెలుగు ప్రజలను ఉద్దేశించి సినీ నటి కస్తూరి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వేడి ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. రెండు కోట్ల మందికి పైగా తెలుగు ప్రజలను కించపరుస్తూ, అవమానించేలా మాట్లాడి, వారి మనోభావాలను దెబ్బతీసిన నటి కస్తూరి(పై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజాతో పాటు పలు తెలుగు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అదేసమయంలో నటి కస్తూరిపై చెన్నై, మదురై పోలీస్ కమిషనరేట్ కార్యాలయాల్లో ఫిర్యాదులు కూడా చేశారు.

ఇటీవల నగరంలో జరిగిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నేతలు అర్జున్ సంపత్, గురుమూర్తి కలిసి సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటి కస్తూరి ప్రసంగిస్తూ రాజుల వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు తెలుగు ప్రజలు వచ్చారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై పెను దుమారం రేగడంతో ఆమె వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ.. నిరసనజ్వాల చల్లారలేదు. ఈ విషయంపై తమిళగ నాయుడు మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి శృతి రమేష్, బోస్, రామమోహన రావు పాసరై తరపున ప్రభు కలిసి మదురై పోలీస్ కమిషనర్ లోకనాథన్‌కు వినతి పత్రం సమర్పించి, కస్తూరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే, సేలంలో దేశీయ తెలుంగార్ మైనార్టీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగ అరవిందన్ కూడా సినీ నటిపై చర్య తీసుకోవాలని చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు. నగరానికి చెందిన సంఘ సేవకురాలు వీరలక్ష్మి( కూడా చెన్నై పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగు ప్రజల మనోభావాలను కించపరిచేలా మాట్లాడటమే కాకుండా ఎన్నో దశాబ్దాలుగా సోదరభావంతో మెలుగుతున్న తమిళ, తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా నటి కస్తూరి వ్యాఖ్యలు చేశారన్నారు.రెండు భాషలకు చెందిన ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడినందుకు కస్తూరిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా మాట్లాడుతూ.. నటి కస్తూరి కేవలం తెలుగు ప్రజలను మాత్రమే కాకుండా, మహిళలను కూడా కించపరిచేలా మాట్లాడారని, ఈ తరహా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలను నేరస్థులుగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రావిడ పాలనలో ఆర్య ఆధిపత్యాన్ని సహించే ప్రసక్తే లేదని రాజా స్పష్టం చేశారు.

## ట్రంప్‌కు అనుకూలంగా అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు.. భారత్‌కు మేలు చేకూరేనా..?



**అమెరికా– నవభూమి:** అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు ముగిశాయి. ఎన్నికల ఫలితాలు కూడా వెలువడుతున్నాయి. ఇప్పటి వరకూ వెలువడిన ఫలితాలన్నీ మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కు అనుకూలంగానే ఉన్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ మార్కు 270. తాజా ట్రెండ్ ప్రకారం.. ట్రంప్ మెజారిటీ మార్క్ 270 ఓట్లను సాధించారు. కమలా హారిస్ మాత్రం 214 వద్దే ఆగిపోయారు. అయితే పూర్తి ఫలితాలు రావడానికి కొంత సమయం పడుతుంది. ఈ క్రమంలో అధ్యక్ష పీఠం మాత్రం ట్రంప్‌దే అని అంతర్జాతీయ మీడియా అంచనా వేస్తోంది.

ఈ క్రమంలో ట్రంప్ అధ్యక్ష పదవిని చేపడితే భారత్‌కు మేలు చేకూరుతుందా..? లేదా..? అనేది ప్రస్తుతం తీవ్రంగా చర్చకు వస్తోంది. భారత్ కోణంలో చూస్తే ట్రంప్ అధ్యక్షుడైతే మంచిదా? భారతీయ మూలాలు ఉన్న కమలా హారిస్ అధ్యక్షురాలైతే మేలా? అనే ఆసక్తికర చర్చ భారత్‌తో పాటు ప్రవాస భారతీయుల్లో జరుగుతున్నది. ట్రంప్ గెలిస్తే.. భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తారా..? లేదా అనేదానిపై చర్చించుకుంటున్నారు. అయితే, ఎవరు గెలిచినా భారత్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదన్న వాదనకూడా వినిపిస్తోంది.

**ఆర్థిక విధానాలు**

వాణిజ్యపరంగా భారత్‌కు అమెరికా చాలా కీలకం. భారతదేశ మొదటి 10 వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో అమెరికాతోనే మనకు ట్రేడ్ సర్‌ప్లస్ ఉంది. అంటే మనం అమెరికా నుంచి చేసుకుంటున్న దిగుమతుల కంటే మనం అమెరికాకు చేస్తున్న ఎగుమతులే ఎక్కువ. భారత్‌తో వాణిజ్యం గురించి ట్రంప్ పదేపదే మాట్లాడుతున్నారు. దిగుమతులపై భారత్ ఎక్కువగా పన్నులు వేస్తున్నదని ఆయన ఆరోపిస్తున్నారు. తాను గెలిస్తే ఈ పరిస్థితిని మార్చేస్తానని చెప్తున్నారు. ఇది భారత్‌కు కొంత ఇబ్బందికరమే. మరోవైపు కమలా హారిస్ సైతం అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలను రూపొందించవచ్చు. అయితే, ఇవి మరీ అసాధారణంగా ఉండకపోవచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి.

**సాంకేతిక రంగం**

ట్రంప్ గెలిచినా, కమలా హారిస్ గెలిచినా చైనాతో మాత్రం కొంత దూకుడుగానే వ్యవహరించవచ్చు. భారత్‌లో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ కేంద్రం ఏర్పాటుకు, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష, 6జీ మొబైల్ సాంకేతికత, సెమీకండక్టర్ వంటి అధునాతన సాంకేతికతలపై కలిసి పని చేసేందుకు భారత్, అమెరికా ఇటీవలే ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సాంకేతిక రంగంలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ప్రస్తుత బైడెన్ సర్కారు ప్రయత్నించింది. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా బైడెన్ పాటించిన విధానాలను కొనసాగించవచ్చు. ఇది పరోక్షంగా భారత్‌కు మేలు కలిగిస్తుంది.

**దౌత్య సంబంధాలు**

గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా అధ్యక్షుడిగా ఎవరు ఉన్నా, అధ్యక్షుడు రిపబ్లికన్ అయినా, డెమోక్రట్ అయినా భారత్‌తో మాత్రం సంబంధాలు బలపడుతున్నాయి. ట్రంప్ గెలిచినా, కమల గెలిచినా ఇదే కొనసాగవచ్చు. అయితే, ట్రంప్‌తో మన ప్రధాని మోదీకి మంచి సంబంధాలు ఉన్నాయి. ఇదే సమయంలో కమలా హారిస్‌కు భారతీయ మూలాలు ఉండటం కూడా భారత్‌తో సంబంధాలను బలోపేతం చేయవచ్చు.

**వలస విధానం**

వలస విధానం విషయంలో ట్రంప్ ఆలోచనలు, విధానాలు కొంత కఠినంగానే ఉంటాయి. ఈ ఎన్నికల్లోనూ ఆయన ఇమ్మిగ్రేషన్ విధానంపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. అక్రమ వలసదారులపై ట్రంప్ కఠినంగా వ్యవహరించవచ్చు. భారతీయులకు కీలకమైన హెచ్1బీ వీసాలపైనా పరిమితులు విధించవచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించి కమలా హారిస్ విధానాలు కొంత వలసదారులకు అనుకూలంగా ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

### గుడ్‌న్యూస్.. ప్రభుత్వ ఉద్యోగాల్లో

# మహిళలకు రిజర్వేషన్లు పెంపు



**భోపాల్–నవభూమి:** మహిళలకు మధ్యప్రదేశ్ సర్కార్ శుభవార్త చెప్పింది. ఇక నుంచి నిర్వహించబోయే అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు పెంచుతున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు అవుతుండగా.. వాటిని మరో 2 శాతం పెంచారు. దీంతో ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. రిజర్వేషన్ల పెంపుతోపాటు మరిన్ని కీలక నిర్ణయాలకు మధ్యప్రదేశ్ కేబినెట్ తాజాగా పచ్చజెండా ఊపుతుంది. మధ్యప్రదేశ్‌లో అధికారంలో ఉన్న మోహన్ యాదవ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం.. సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్లను పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మధ్యప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లను కల్పించనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే భోపాల్‌లోని మంత్రాలయలో ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత తాజాగా మధ్యప్రదేశ్ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని డిప్యూటీ సీఎం రాజేంద్ర శుక్లా వెల్లడించారు.మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ సర్వీసుల కింద అన్ని రిక్రూట్‌మెంట్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. తాజాగా మరో 2 శాతం పెంచడంతో ఇప్పటి నుంచి విడుదలయ్యే అన్ని ప్రభుత్వ నోటిఫికేషన్లకు మహిళా రిజర్వేషన్లు 35 శాతం అమలు చేయనున్నారు. ఈ క్రమంలోనే మహిళా సాధికారతకు మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న ముందడుగు అని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాజేంద్ర శుక్లా అభివర్ణించారు.

సివిల్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ సహా అన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఈ 35 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని మధ్యప్రదేశ్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అన్ని సర్వీసుల్లో మహిళల రిజర్వేషన్ శాతాన్ని పెంచుతున్నట్టు ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి గతంలో ఉన్న వయో పరిమితిని పెంచడం సహా మరిన్ని కీలక నిర్ణయాలకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసినట్లు వివరించారు. ఇప్పటివరకు మధ్యప్రదేశ్‌లో మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల వయో పరిమితి 40 ఏళ్లు ఉండగా.. దాన్ని మరో 10 ఏళ్లు పెంచడంతో అది కాస్తా 50 ఏళ్లకు పెరిగింది.

### ఓటమి నేపథ్యంలో.. ఎలక్షన్ నైట్

# ప్రసంగాన్ని రద్దు చేసుకున్న కమలా హారిస్



**అమెరికా– నవభూమి:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలుపు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. మెజారిటీ మార్క్ 270కి కేవలం మూడు ఓట్ల దూరంలో ట్రంప్ ఉన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ మార్కు 270. ఇప్పటి వరకూ వెల్లడైన ఫలితాల్లో ట్రంప్ 267 ఎలక్టోరల్ ఓట్లతో దూసుకెళ్తున్నారు. ఇక డెమోక్రటిక్ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ మాత్రం కేవలం 214 ఓట్ల వద్దే కొనసాగుతున్నారు. దీంతో ట్రంప్ మద్దతుదారులు సంబరాలు మొదలు పెట్టేశారు. ఇక విక్టరీ నేపథ్యంలో మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది.

అదే సమయంలో ఓటమి నేపథ్యంలో కమలా హారిస్ తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్నట్లు ప్రకటించారు కమలా హారిస్ ఎలక్షన్ నైట్ హార్వర్డ్ యూనివర్సిటీ వాచ్ పార్టీలో ప్రసంగించాల్సి ఉంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్నారు. ఆమె రేపు మాట్లాడతారని కమలా హారిస్ ప్రచార బృందం తాజాగా ప్రకటించింది.

**నవభూమి**
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## ఇక హైదరాబాద్‌లో.. సూర్య కంగువ ప్రీ రిలీజ్ ఈవెంట్ టైం, వెన్యూ ఫిక్స్..!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మోస్ట్ ఎవెయిటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ సూర్య 42వ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి శివ దర్శకత్వం వహిస్తున్నాడు. కంగువలో బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు.కంగువ నవంబర్ 14న తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదలవుతుండగా.. సూర్య టీం ఇప్పటికే కోచి, చెన్నైలో గ్రాండ్‌గా ప్రమోషన్స్ నిర్వహించింది. తాజాగా తెలుగు ప్రమోషన్స్ టైం వచ్చేసింది. కంగువ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నవంబర్ 7న పార్క్ హయత్‌లో సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు మేకర్స్. ఇప్పుడీ స్టిల్ నెట్టింట క్యూరియాసిటీ పెంచేస్తుంది.స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్న కంగువ ఫ్రెంచ్, స్పానిష్, ఇంగ్లీష్ సహా ఎనిమిది భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఈ మూవీని నైజాం ఏరియాలో పాపులర్ టాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేస్తుంది. ఓవర్సీస్ విషయానికొస్తే నార్త్ అమెరికాలో యూకేలో యశ్ రాజ్ ఫిలిమ్స్ , సింగపూర్‌లో హెూం స్క్రీన్, గల్ఫ్ దేశాల్లో రిలీజ్ చేస్తున్నాయి.



# రివాల్వర్ రీటా వచ్చేస్తుంది..

### టాప్ బ్యానర్ల చేతిలో కీర్తి సురేశ్ సినిమా రైట్స్




నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి కీర్తి సురేశ్ వరుస సినిమాలతో బిజీగా ఉందని తెలిసిందే. ఈ భామ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం రివాల్వర్ రీటా చంద్రు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. రివాల్వర్ రీటా పంపిణీ హక్కులకు సంబంధించిన వార్త నెట్టింట వైరల్ అవుతోంది.

ఈ సినిమా తెలుగు పంపిణీ హక్కులను హాస్య మూవీస్ నిర్మాత రాజేశ్ దండా దక్కించుకోగా.. కర్ణాటక హక్కులను బెంగళూరు కుమార్ ఫిలిమ్స్ దక్కించుకుంది. కీర్తిసురేశ్ సినిమాకు క్రేజీ ఎలా ఉందో తాజా వార్త చెప్పకనే చెబుతోంది. ఈ మూవీలో రాధికాశరత్ కుమార్, అజయ్ ఘోష్, సునీల్, జాన్ విజయ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఇటీవల లాంఛ్ చేసిన విడుదల చేసిన రివాల్వర్ రీటా టీజర్ కీర్తి సురేశ్ మార్క్ హ్యూమర్ టచ్‌తో యాక్షన్ పార్టుతో స్టన్నింగ్‌గా సాగుతోంది. కీర్తి సురేశ్ మార్కెట్‌లో కూరగాయలు కొంటుండగా.. పాత అంబాసిడర్ కారులో ఉన్న దొంగలునుంచి ఆమెను చూస్తారు. కారులో కీర్తిసురేశ్ దగ్గరకు వచ్చి హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కెళ్తారు.ఆ తర్వాత వారిని వెంబడించిన కీర్తిసురేశ్ రివాల్వర్ రీటాగా మారుతుంది. ఇంతకీ రివాల్వర్ రీటా ఏదైనా మిషన్‌లో పాల్గొంటుందా.. ? అనేది సస్పెన్స్ లో పెడుతూ సాగే సన్నివేశాలు సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి.



# నడుమునే చూస్తుంటే..!

చిట్టి ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీల్లో హర్యానా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన మీనాక్షి చౌదరి ఫెమినా మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 20218 కిరీటాన్ని సొంతం చేసుకుంది. మోడలింగ్ లో రాణించిన చాలా మంది సినిమా ఇండస్ట్రీలో రాణించలేక పోయారు. మిస్ ఇండియా, మిస్ వరల్డ్ గా నిలిచిన వారు కొందరు మాత్రమే సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు. మీనాక్షి చౌదరి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో సక్సెస్ అవ్వడం కష్టమే అని చాలా మంది అనుకున్నారు. అంతా అనుకున్నట్లుగానే మొదట్లో ఫ్లాప్స్ చవి చూసిన మీనాక్షి ఇప్పుడు టాప్ హీరోయిన్స్ జాబితాలో చేరింది. తెలుగులో ఇచ్చుట వాహనములు నిలుపరాదు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయింది. ఆ సినిమా పెద్దగా ఆడలేదు. దాంతో మీనాక్షి గురించి మీడియాలో పెద్దగా చర్చ జరగలేదు. దాంతో మీనాక్షి చౌదరికి టాలీవుడ్‌లో తదుపరి ఆఫర్ వచ్చేనా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. లక్కీగా ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కడంతో తన సత్తా చాటింది. ఈ ఏడాది గుంటూరు కారం సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమా నిరాశ పరచినా మంచి గుర్తింపు మాత్రం తెచ్చి పెట్టింది అనడంలో సందేహం లేదు. తాజాగా దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'లక్కీ భాస్కర్' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. మరో రెండు మూడు సినిమాలు సైతం ఈ అమ్మడు నటించగా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే ఏడాది టాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్గా ఈ అమ్మడు నిలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే సక్సెస్ జోష్ తో ఈ అమ్మడు ఫోటోలకు చాలా అందమైన చిరు నవ్వుతో ఫోజ్‌లు ఇస్తుంది. తాజాగా ఒక మీడియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఇలా అందంగా ఎల్లో చీర కట్టులో కనిపించింది. %కూశ్రీంశీ =ఖుఃం% - లక్కీ భాస్కర్.. ఆ అమ్మయి బాగానే క్లిక్కయ్యిందిగా.. సన్నగా నాజూకుగా ఉండే మీనాక్షి చౌదరి చీర కట్టులో భలే అందంగా ఉందని గతంలోనూ పలు సార్లు సోషల్ మీడియాలో కామెంట్స్ వచ్చాయి. ఈసారి ఎల్లో చీర కట్టులో అందమైన స్కిన్ టోన్ తో మీనాక్షి చౌదరి భలే అందంగా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ఆ చిట్టి నడుము ను చూస్తూ ఉంటే మతి పోతుందని, పవన్ కళ్యాణ్ పాడినట్లుగా చిట్టి నడుమునే చూస్తుంటే.. అంటూ పాట పాడాలి అనిపిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ చిట్టి నడుము మీనాక్షి చౌదరి ఫోటోలను మీరు ఓ లుక్కేయండి. ఇంత అందంగా ఉంటే స్టార్ హీరోల నుంచి పిలుపు రాకుండా ఉంటుందా చెప్పండి.. అందుకే వచ్చే ఏడాదిలో స్టార్ హీరోల సినిమాలకు ఈమె కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## బిగ్ బాస్ హౌజ్ నుంచి బయటకు రానున్న గంగవ్వ.. కారణం అదేనా.?



బుల్లితెర ప్రేక్షకుల ఫేవరేట్ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 8 రసవత్తరంగా సాగుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తొమ్మిది వారాలు కంప్లీట్ చేసుకున్న ఈ షో పదో వారంలోకి ఎంటర్ అయ్యింది. ఇక ఈ వారం నామినేషన్స్ కూడా రసవత్తరంగా సాగుతున్నాయి. ఇక ఈ వారం ఏడుగురు నామినేషన్ కంటెస్టెంట్స్ ఉన్నారు. నిఖిల్, పృథ్వీ, యష్మీ, ప్రేరణ, విష్ణుప్రియ, హరితేజ, గౌతమ్ నామినేషన్స్‌లో ఉన్నారు.

అయితే ఈ వారం హౌజ్ నుంచి వెళ్లేవారిలో గంగవ్వ కూడా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. గత సీజన్‌లో మెయిన్ కంటెస్టెంట్ గా అడుగు పెట్టిన గంగవ్వ హౌస్ వాతావరణానికి అలవాటుపడలేకపోయింది. దీంతో మధ్యలోనే హౌజ్ నుంచి బయటకు వచ్చింది. అయితే మళ్లీ ఈ సీజన్‌లో వెల్డ్ కార్డు ద్వారా ఎంట్రీ ఇచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది. ఇక వచ్చి రాగానే ఫిజికల్ టాస్కులో గెలిచి కంటెస్టెంట్‌లతో పాటు ప్రేక్షకులకు షాక్ ఇచ్చింది గంగవ్వ. అయితే గంగవ్వ వయసు దృష్ట్యా ఫిజికల్ టాస్కులు ,గేమ్ లో పార్టిసిపేట్ చేయడంపై దూరం పెట్టాడు బిగ్ బాస్. ఇదిలావుంటే హౌజ్‌లో ఉంటున్న గంగవ్వకు మళ్లీ అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలుస్తుంది. ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు తనను ఇబ్బంది పెడుతున్నయంటూ గత శనివారం ఎపిసోడ్‌లో నాగార్జునతో తన బాధ చెప్పుకుంది. ప్రస్తుతం గంగవ్వ పరిస్థితి చూస్తుంటే.. సెల్ఫ్ ఎలిమినేషన్ ద్వారా మళ్లీ హౌస్ నుంచి బయటకు పోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.మరోవైపు ఈ వారం నామినేషన్ అయిన వారిలో ఎక్కువ ఓటింగ్‌తో గౌతమ్ మొదటి స్థానంలో ఉండగా.. నిఖిల్ రెండో స్థానంలో ఉన్నాడు. మరోవైపు యాంకర్ విష్ణు ప్రియ, హరితేజ చివరి రెండుస్థానాలతో డేంజర్ జోన్‌లో ఉన్నారు.

## 'పుష్ప 2' సినిమా.. ఫస్ట్ టైం ఇన్ హిస్టరీ మహిళా ఫ్యాన్స్‌కు స్పెషల్ షో.. ఎక్కడంటే.?




మరో నెల రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా పుష్ప గాడి సందడి మొదలుకానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఓవర్సీస్‌కు సంబంధించి బుకింగ్ స్టార్ట్ అవ్వగా.. ఇండియాలో ఎప్పుడు స్టార్ట్ అవుతాయా అని అటు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా తాజాగా అరుదైన రికార్డును క్రియేట్ చేయబోతుంది. చరిత్రలో మొట్టమొదటి సారి మహిళలకు ఫ్యాన్స్ షో వేయబోతున్నారు.

అదికూడా ఒక తెలుగు హీరోకి తెలుగు రాష్ట్రాల్లో కాకుండా కేరళలో కావడం విశేషం. అవును పుష్ప సినిమాకు మహిళలకు ప్రత్యేక షో వేయబోతున్నట్లు అల్లు అర్జున్ కేరళ ఫ్యాన్స్ ప్రకటించారు. ఉదయం 7 గంటలకు ఈ షో ప్రదర్శించబోతున్నట్లు ఫ్యాన్స్ ప్రకటించారు. దీంతో ఏ హీరోకి లేని ఒక రికార్డును అల్లు అర్జున్ క్రియేట్ చేయబోతున్నాడు.అల్లు అర్జున్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'పుష్ప 2'. పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 06న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

## తెలుగు ప్రజలపై వివాదాస్పద వ్యాఖ్యలు.. నటి కస్తూరిపై చెన్నైలో కేసు నమోదు



తమిళ సీనియర్ నటి కస్తూరిపై చెన్నైలో కేసు నమోదు అయ్యింది. తమిళనాడు బీజేపీ కార్యకర్త అయిన కస్తూరి తెలుగు ప్రజల గురించి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.కస్తూరి బీజేపీ సభలో మాట్లాడుతూ.. తమిళనాడులో 300 ఏండ్ల క్రితం రాజుల కాలంలో అంత:పురం మహిళలకు సేవ చేసేందుకు వచ్చిన వాళ్లే తెలుగువారని.. అలా వచ్చినవారు ఇప్పుడు తమది తమిళ జాతి అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడింది. అయితే తెలుగు ప్రజలపై కస్తూరి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీంతో దిగొచ్చిన ఆమె మిమ్మల్ని బాధ పెట్టడం నా ఉద్దేశం కాదు. నా వ్యాఖ్యలు మీ మనసును బాధపెట్టి ఉంటే క్షమించండి. నేను మాట్లాడిన మాటలు పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నాను అని నటి కస్తూరి పేర్కొంది.అయితే కస్తూరి చేసిన వ్యాఖ్యలపై తాజాగా చెన్నైలోని ఎగ్మోర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. తమిళనాడులోని తెలుగు ప్రజలు ఈ పిటిషన్ ఇవ్వగా.. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## భర్తపై ఉన్న కేసు కొట్టివేయాలని తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అల్లు అర్జున్ భార్య



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. బుధవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్నేహారెడ్డి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం అందించారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి.. పట్టువస్త్రంతో సత్కరించారు. అయితే స్నేహారెడ్డి నేడు తిరుమల రావడానికి కారణం తన భర్త అల్లు అర్జున్‌పై ఉన్న కేసు అని తెలుస్తుంది.ఏపీ అసెంబ్లీ ఎలక్షన్స్(2024) సమయంలో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే కారణంతో నంద్యాల పోలీసులు అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసును కొట్టేయాలంటూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ కేసుపై నేడు తుది తీర్పు వెలువరించనుంది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు. కాగా.. ఈ కేసు విషయంలోనే స్వామివారిని స్నేహారెడ్డి దర్శించుకున్నట్లు సమాచారం.

## ముగిసిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ, ఫెన్సింగ్ టోర్నీ



**నెల్లికుదురు– నవభూమి:** నెల్లికుదురు, నవంబర్ 5 : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విలువిద్య, ఫెన్సింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఆర్చరీలో 14 ఏండ్ల విభాగంలో 24 మంది బాలబాలికలు, 17 సంవత్సరాల విభాగంలో 24 మంది విజేతలుగా నిలిచారు. వీరు గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఫెన్సింగ్‌లో 14 ఏండ్ల విభాగంలో 24 మంది బాలబాలికలు, 17 ఏండ్ల విభాగంలో 24 మంది, 19 ఏండ్ల విభాగంలో 24 మంది, గ్రూప్ ఈవెంట్‌లో నలుగురు మొత్తం76 మంది విజేతలుగా నిలిచారు. వీరు పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీ పడుతారు. ఆర్చరీ, ఫెన్సింగ్‌లో క్రీడాకారులు ప్రదర్శన ఆధారంగా స్వర్ణ,రజత, కాంస్య పతకాలను అందజేశారు. ఆర్చరీ, ఫెన్సింగ్‌లో కలిసి 600 మంది క్రీడాకారులు పాల్గొనగా 124 మంది జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర పరిశీలకులు రవి, ఎస్సై రమేశ్ బాబు, మండల విద్యాశాఖ అధికారి రాందాస్, పీడీలు ఐలయ్య, సునీత, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, టెక్నికల్ పర్సన్లు హరికృష్ణ, శ్రీనివాస్, పుల్లయ్య పాల్గొన్నారు.

## మళ్లీ కెప్టెన్‌గా వార్నర్.. ఆ ఫ్రాంచైజీకి ట్రోఫీ ఖాయమేనా..?



**ఆస్ట్రేలియా– నవభూమి:** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ మళ్లీ కెప్టెన్ అయ్యాడు. సుదీర్ఘ కెరీర్‌లో మాయని మచ్చలా నిలిచిన సాండ్ పేపర్ వివాదం నుంచి ఎట్టకేలకు డేవిడ్ భాయ్ బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్ జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు. క్రికెట్ ఆస్ట్రేలియా వార్నర్‌పై నిషేధాన్ని ఎత్తేసిన రెండు వారాల్లోనే సిడ్నీ యాజమాన్యం అతడిని మళ్లీ నాయకుడిగా చేసింది. దాంతో, వచ్చే సీజన్‌లో ఈ డాషింగ్ బ్యాటర్ క్రిస్ గ్రీన్ స్థానంలో జట్టును నడిపించనున్నాడు.'వచ్చే సీజన్‌లో థండర్స్‌కు కెప్టెన్సీ వహించడం నాకు ఎంతో గొప్ప ఫీలింగ్. బీబీఎల్ సీజన్ ఆరంభంలో నేను థండర్స్‌కు ఆడాను. ఇప్పుడు కెప్టెన్‌గా మళ్లీ ఆ జట్టుకు ఆడబోతున్నందుకు సంతోషంగా ఉంది. జట్టును ముందుండి నడిపించడంతో పాటు నా అనుభవాలను యువ ఆటగాళ్లతో పంచుకుంటాను. అంతేకాదు డ్రెస్సింగ్ రూమ్‌లో మంచి వాతావరణం ఉండేలా చూస్తాను. ఇక.. కెప్టెన్ క్రిస్ గ్రీన్ నిజంగా గొప్ప ప్రతిభావంతుడు. అతడి నాయకత్వ లక్షణాలు అద్భుతం అని వార్నర్ వెల్లడించాడు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ విజేత పాలమూరు



**మూసాపేట(అడ్డాకుల)–నవభూమి:** మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 5 : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో మహబూబ్‌నగర్ బాలబాలికల జట్లు టైటిల్ విజేతలుగా నిలిచాయి. హైదరాబాద్ బాలురు, ఖమ్మం బాలికల జట్లు రన్నరప్‌గా నిలిచాయి. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచాలలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న అండర్-17, అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారంతో ముగిశాయి. విజేత జట్లకు శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, డీఈవో రవీందర్ షీల్డులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**